**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 39, పేజీలు - 08

- Host On Your Domain
- Hosting / Admin Panel
- Page Builder / Social Links
- Responsive Design
- Advertisement Spaces
- Search Engine Optimization
- XML Sitemap
- Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

మంగళవారం, ఆగష్టు 4, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# హైడ్రా చుట్టూ న్యాయపరమైన సంక్షోభం

**- రంగనాథ్ బదిలీకి హైకోర్టు ఆదేశం**

**- రేవంత్ ప్రభుత్వ వ్యూహం ఏంటి.?**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా వ్యవస్థ, దాని నిర్వహణా తీరుపై తెలంగాణ హైకోర్టు తీసుకున్న కఠిన వైఖరి రాష్ట్రంలో హాట్ టాపిక్ అయింది. సికింద్రాబాద్ లోతుకుంటలోని ఓ ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థ ఆస్తులకు సంబంధించిన 40 ఎకరాల భూవివాదంలో కోర్టు ముందస్తు ఆదేశాలను ఉల్లంఘించి కూల్చివేతలకు దిగడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐపీఎస్ అధికారి, హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ ఆయనను తక్షణమే ఆ బాధ్యతల నుంచి తప్పించి, ప్రత్యామ్నాయ అధికారినీ నియమించాలని హైకోర్టు సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది.

### రంగనాథ్‌కు మద్దతుగా సీఎం రేవంత్

న్యాయస్థాన ఆదేశాల ప్రకారం ఐపీఎస్ రంగనాథ్‌పై కేవలం ఏడాదిన్నర కాలంలోనే దాదాపు 63 కోర్టు ధిక్కరణ కేసులు నమోదు కావడం, శాసన వ్యవస్థ నిర్దేశించిన పరిధి దాటి ప్రవర్తించారని ధర్మాసనం వ్యాఖ్యానించడం ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే, కోర్టు ఉత్తర్వులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా స్పందిస్తూ ప్రభుత్వాన్ని గట్టిగా సమర్థించుకున్నారు. ఏ అధికారిని ఎక్కడ నియమించాలో, బాధ్యతలు అప్పగించాలో నిర్ణయించే కార్యనిర్వహణాధికారం పూర్తిగా ప్రభుత్వానిదే అని రేవంత్ రెడ్డి

2లో..

## కర్ణాటక కాంగ్రెస్‌లో తిరుగుబాటు జ్వాల

**- క్యాబినెట్‌లో చోటు దక్కక ఎమ్మెల్యేల రాజీనామాలు!**



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** కర్ణాటక రాజకీయాల్లో మంత్రివర్గ విస్తరణ వేళ అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలో నూతన క్యాబినెట్‌లో తమకు స్థానం లభించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టారు. సోమవారం నూతన మంత్రుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి కొద్ది గంటల ముందు ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశవంతరాయగౌడ వి.పాటిల్, సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బెళూరు గోపాలకృష్ణ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం కన్నడ రాజకీయాల్లో ఒక్కసారిగా పెను సంచలనం సృష్టించింది.

2లో..

## వరద నీటిని సద్వినియోగం చేసుకోండి

**- రవాణాశాఖలో అనవసర నిబంధనలు తొలగించండి**




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టిపెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను, రిజర్వాయర్లలో, నీటి వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఎగువన వర్షాలు కురుస్తున్నందున్న కృష్ణా బేసిన్ లో నీటి లభ్యత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయని అధికారులు వివరించారు.

2లో..

## నిమ్స్‌కు అరుదైన ఘనత

**- 1000 రొబోటిక్ సర్జరీలు పూర్తి, 90 శాతం ఫ్రీ**

**- అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో నిమ్స్ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కేవలం రెండున్నరేళ్లలోనే 1000 రొబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి రికార్డు సృష్టించింది.

2లో..

## ఇంటింటికీ వెళ్లకుంటే.. అటునుంచి ఇంటికే

**- సీఎం చంద్రబాబు సీరియస్ వార్నింగ్**




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కార్యక్రమం ప్రారంభమయి వారం అయింది. అయితే చాలా మంది ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని లైట్ గా తీసుకున్నారని చంద్రబాబు గ్రహించారు. దీంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇంటింటికి వెళ్లకుంటే ఇక అటు నుంచి అటు ఇంటికే అని చంద్రబాబు నేతలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. టీడీపీ నిర్వహిస్తున్న ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని చంద్రబాబు జరపిన సమీక్షలో చాలా మంది నేతలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని వెల్లడయింది. దీంతో ఆయన కొందరి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

### రెండేళ్లు పూర్తి కావస్తుండటంతో

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తుండటంతో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం నలభై ఐదు రోజుల పాటు ఈకార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అయితే కొందరు నేతలు మాత్రం నామమాత్రంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటూ ఫొటోలు కొన్ని అప్ లోడ్ చేస్తూ తర్వాత ముఖ్య కార్యకర్తలను, ద్వితీయ శ్రేణి నేతలను ఈ కార్యక్రమంలో పంపుతున్నట్లు తెలుసుకున్న చంద్రబాబు నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొన్ని జిల్లాల్లో నేతలు పూర్తిగా ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నట్లు చంద్రబాబు గుర్తించారు.

### తూతూ మంత్రంగా

మై టీడీపీ యాప్ ను పరిశీలించడంతో పాటు టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన నివేదికలను అనుసరించి కొన్ని జిల్లాల్లో నేతలు అసలు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించలేదని తెలిసి అవాక్కయినట్లు తెలిసింది.

2లో..

## కుంభవృష్టి ఖాయం, ప్రాణనష్టం తప్పదు

**- ఉజ్జయిని రంగంలో అమ్మవారి హెచ్చరిక!**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ బోనాల ఉత్సవాలు నేత్రపర్వంగా ముగిశాయి. ఉత్సవాల్లో సోమవారం ఉదయం నిర్వహించిన రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. సరిగ్గా ఉదయం 9.55 గంటలకు పచ్చికుండపై నిలబడిన అమ్మవారు

2లో..

## పెద్ది మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది

**- "మిస్టర్ డ్రామారావు" అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి

2లో..

## 20 వేల పోస్టులుంటే.. 7 వేలకే నోటిఫికేషన్ ఇస్తారా.?

**- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ముఖ్యంగా యువతను జాబ్ క్యాలెండర్ పేరుతో నిలువునా ముంచారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. చట్టసభల్లో పెట్టిన జాబ్ క్యాలెండర్ కూడా దిక్కులేదని విమర్శించారు. అందుకే యువత నిర్వేధంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని, ఎవరూ అధైర్య పడొద్దని హితవుపలికారు. " ఎన్నికల ముందు డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ మోసం. రాష్ట్రంలో నిరుద్యోగులు నిర్వేదంలో ఉన్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ఏమైంది?డిప్యూటీ సీఎం ఇలాకాలో యువకుడు లేఖ రాసి ఆత్మహత్యయత్నం చేశాడు. కాంగ్రెస్ హామీ ఏమైందని యువకుడు ప్రశ్నించాడు. పిల్లలు ఇక్కడ ఆత్మహత్యలకు పాల్పడుతుంటే రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నాడు? ఇంజినీర్లు క్రిమినల్ వేస్టు అని రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు. రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలు కూడా దాటలేదు. మీ చేతగాని అసమర్థ పాలనకు ఒక ఛార్జిషీట్ ఈ సూసైడ్ నోట్. ఆ పిల్లాడి సూసైడ్ నోట్ చూస్తే బాధ కలిగింది. నిరుద్యోగులు దయచేసి బలవన్మరణాలకు పాల్పడవద్దు.మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాలు భర్తీ చేస్తాం. దయచేసి తనువులు చాలించకండి." అని సూచించారు.

### రాహుల్ గాంధీ ఫోజులు

జెన్‌జీ ఉద్యమంలో పాల్గొన్నట్టు , విద్యార్థులకు అండగా ఉంటున్నట్టు రాహుల్ గాంధీ ఫోజులు కొడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇక్కడ మాత్రం ఆ పార్టీ సీఎం విద్యార్థులను క్రిమినల్స్‌తో పోలుస్తున్నారని దీనికి రాహుల్ చెప్పే సమాధానం ఏంటని నిలదీశారు. " విద్యార్థుల ఆందోళనకు మద్దతు పలికినట్టుగా రాహుల్ పోజులు. మీ ముఖ్యమంత్రి ఇంజనీర్లను క్రిమినల్ వేస్ట్ అన్నాడు. రేవంత్ వ్యాఖ్యలపై రాహుల్ ఉలకడు పలకడు. రాహుల్‌కు, రేవంత్‌కు విద్యార్థుల ముందకొచ్చి మాట్లాడే దమ్ములేదు. ఇతర రాష్ట్రాల్లో లాఠీఛార్జీలు జరిగితే రాహుల్ పరిగెత్తుకొని పోతాడు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో లాఠీఛార్జీలు జరిగితే మాత్రం రాడు. ఇంజనీర్లను క్రిమినల్ వేస్ట్ అంటే అందరం బాధపడ్డం. విదేశాల్లో పనిచేస్తున్న మన ఇంజనీర్లు క్రిమినల్ వేస్టా? రాహుల్ గాంధీ, రేవంత్ కలిసి ప్రకటించిన డిక్లరేషన్లు క్రిమినల్ వేస్ట్. వందల టీఎంసీల నీళ్లను

2లో..

## నా గెలుపు బీజేపీకి గట్టి సందేశం

**- బంకీపూర్‌లో గెలుపుపై పీకే సంచలన వ్యాఖ్యలు**

**పాట్నా (ప్రశ్న న్యూస్)** బిహార్‌లోని బంకీపూర్ నియోజకవర్గానికి జరిగిన ఉప-ఎన్నికల్లో జన్ సూరజ్ పార్టీ అధినేత విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై ఆయన దాదాపు 20 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బీజేపీకి కంచుకోట లాంటి ఈ స్థానంలో పీకే విజయంతో అధికార పార్టీ ఖంగుతింది. 1995 నుంచి ఇక్కడ వరుసగా బీజేపీ జెండా ఎగురుతూ వస్తోంది.

2లో..



## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో మరో ట్విస్ట్

**- దర్యాప్తులో సంచలన నిజాలు**

**- మరో మహిళతో ప్రేమాయణం**

**- లవ్‌లెటర్స్, కత్తి స్వాధీనం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి సామాన్యుడు కాదనిపిస్తోంది. ఆయన మరో మహిళతో ప్రేమాయణం సాగించిన విషయం వెలుగులోకి వచ్చింది. మహిళ ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులకు రోజుకో విషయం తెలుస్తోంది.

2లో..

## మునిగిపోతున్న తీరప్రాంత నగరాలు

**- శాస్త్రవేత్తల అధ్యయనంలో ఆసక్తికర విషయాలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సినిమాల్లో సముద్రం నగరాలను మింగేసే దృశ్యాలు చూస్తుంటాం. అవి కల్పిత కథలుగా అనిపించినా, ఇప్పుడు అదే దిశగా పరిస్థితులు మారుతున్నాయని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. వాతావరణ మార్పులతో సముద్ర మట్టం పెరగడం ఒక కారణమైతే, తీర ప్రాంతాల్లో నేల క్రమంగా కుంగిపోవడం మరో పెద్ద ముప్పుగా మారిందని శాస్త్రవేత్తలు

2లో..

# హైడ్రా చుట్టూ న్యాయపరమైన సంక్షోభం

స్పష్టం చేశారు. హైడ్రా ద్వారా భూమి ఆక్రమణదారుల నుంచి చెరువులను రక్షించడం తమ ప్రాధాన్యత అని, హైకోర్టు ఉత్తర్వులపై పూర్తి స్థాయి న్యాయ సలహాలు తీసుకుని ముందడుగు వేస్తామని చెప్పారు.

### న్యాయపరమైన పోరాటం చేసే అవకాశం

కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందా లేదా హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించి స్టే తెస్తుందా అనేది ఇప్పుడు ప్రధానాంశంగా మారింది. న్యాయ నిపుణుల విశ్లేషణ ప్రకారం, కోర్టు ఆదేశాలను నేరుగా ధిక్కరించడం సాధ్యపడదు కాబట్టి, ప్రభుత్వం చట్టపరమైన పరిష్కారాల వైపే మొగ్గు చూపుతోంది. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు అప్పీలులో రంగనాథ్ నియామకం, నిబంధనల ఉల్లంఘనపై ఉపశమనం లభించకపోతే, రంగనాథ్‌ను మరో విభాగానికి బదిలీ చేసి, హైడ్రా బాధ్యతలను క్లీన్ ఇమేజ్ ఉన్న మరో సీనియర్ ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారికి అప్పగించే ఆలోచనలో కూడా ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

### రాజ్యాంగ విరుద్ధమైన పాలన సాగుతోందంటున్న విపక్షాలు

మరోవైపు, ప్రతిపక్ష బిఆర్ఎస్, బీజేపీలు హైడ్రా విఫలమైందనడానికి, ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన పాలన సాగిస్తోందనడానికి కోర్టు వ్యాఖ్యలే సాక్ష్యమని విమర్శలు గుప్పిస్తున్నాయి. పదివేల కంటే ఎక్కువ కోర్టు ధిక్కరణ కేసులు ఇప్పటికే రాష్ట్రంలో ఉన్నాయని, పొలిటికల్ ప్రచారం కోసం ప్రతిపక్షాలే హైడ్రాపై కుట్రపూరితంగా కేసులు వేయిస్తున్నాయని రేవంత్ రెడ్డి ప్రత్యారోపణ చేశారు. విధానపరమైన లోపాలు, గైడ్‌లైన్స్ లోపించడం వల్లే హైడ్రా ఇలాంటి చిక్కుల్లో పడిందనే విమర్శను తుడిచిపెట్టేందుకు హైడ్రా చట్టబద్ధత సమగ్ర నిబంధనావళిని రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

**హైడ్రా అధిపతి బదిలీ వ్యవహారం కేవలం ఒక అధికారి ఉద్యోగ రక్షణకు సంబంధించినది మాత్రమే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన అతిపెద్ద పరిపాలనా సంస్కరణల విశ్వసనీయతకు సంబంధించిన అంశం. కోర్టు విధించిన గడువులోగా రంగనాథ్ స్థానంలో కొత్త అధికారి వస్తారా, లేదా న్యాయపోరాటం ద్వారా రంగనాథ్‌ను కొనసాగిస్తూనే హైడ్రా బుల్డోజర్ స్పీడ్‌కు చెక్ పడకుండా ప్రభుత్వం కాపాడుకుంటుందో వేచి చూడాలి.**

# 20 వేల పోస్టులుంటే.. 7 వేలకే నోటిఫికేషన్ ఇస్తారా.?

సముద్రంలోకి వదలడం క్రిమినల్ వేస్ట్. రూ.200 కోట్లతో అందాల పోటీలు పెట్టడం క్రిమినల్ వేస్ట్. మెస్సీతో ఫుట్ బాల్ ఆటకు రూ.100 కోట్లు తగలేయడం క్రిమినల్ వేస్ట్. తెలంగాణకు రేవంత్ అనే సన్నాసిని సీఎంగా పెట్టడమే క్రిమినల్ వేస్ట్. రేవంత్ ఏం చదివిండో డౌటే. నకల్ కొట్టి పాసైన బాపతే అయ్యింటుంది." అని ఎద్దేవా చేశారు.

### గోడల మీదా సున్నాలేసుకొని బతికినోడివి

రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గోడలకు సున్నాలు వేసుకొని బతికేటోడివి అంటూ హేళనగా మాట్లాడారు. కనీసం ఎలక్షన్ ఫామ్ కూడా నింపడం రాలేదని ఎద్దేవా చేశారు. జీవితంలో ఇంటర్వ్యూకైనా హాజరైనావా అని ప్రశ్నించారు. " మిస్టర్ రేవంత్.. నీ ఎలక్షన్ ఫామ్ నింపుగలుగుతవా? నీ జీవితంలో ఒక్క పోటీ పరీక్ష రాసినవా? ఎప్పుడైనా ఒక ఇంటర్వ్యూకు హాజరైనవా? మేం కష్టపడి చదివినం.. గొప్పగొప్ప యూనివర్సిటీల్లో చదివినం. గోడల మీద సున్నాలేసుకొని బతికినోడివి నువ్వు. నీకే అంతుంటే, ఇంజనీర్లకు ఎంతుండాలి? హైదరాబాద్లో ఫ్లై ఓవర్లు కట్టిందెవరు? ఇంజనీర్లు కాదా? ఎల్లంపల్లి నుంచి రివర్స్ పంపింగ్ చేస్తున్నది ఇంజనీర్లు కాదా? నువ్వు కూసునే కమాండ్ కంట్రోల్ సెంటర్ కట్టింది ఇంజనీర్లు కాదా? ఇంజినీర్లకు కట్టడం తెలుసు మీ పార్టీకి సమాధి కట్టడం కూడా తెలుసు." అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

### రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడు?

రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారని ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఈసారి కచ్చితంగా అసెంబ్లీ 15రోజులు నడపాల్సిందేనంటూ డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యతోపాటు ఇతర విషయాలపై సమగ్రంగా చర్చించాలని పట్టుబట్టారు. "నిరుద్యోగుల తరఫున రేవంత్, రాహుల్ను ప్రశ్నిస్తున్న. రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారు? రాహుల్, రేవంత్ ఎక్కడ చచ్చారు? అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు నడపాల్సిందే. నిరుద్యోగుల తరఫున అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. నిరుద్యోగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని నా ప్రార్థన. విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకో. ముందు నీ చేతిలో ఉన్న పని చేయి." అని డిమాండ్ చేశారు.


### ఆ తీర్మానం చిత్తు కాగితం

బీసీ రిజర్వేషన్లు మోడీ ఆపారని రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆయన చేసిన తీర్మానం చిత్తు కాగితమని అన్నారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కేలా రేవంత్ వ్యాఖ్యలు ఉన్నాయని అన్నారు. విద్యా హక్కు చట్టాన్ని తెచ్చింది సోనియా గాంధీ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ తీసుకొచ్చిన చట్టాన్ని వాళ్లే తుంగలో తొక్కుతారా? అని ప్రశ్నించారు. "గురుకులాల్లో 150 మంది విద్యార్థులను చంపడం కాంగ్రెస్ సక్సెసా? ఎండ్రిన్ తాగి చావండని తిట్టడం సక్సెసా? కాంగ్రెస్ వచ్చాక తెలంగాణలో టెక్ ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఏడు వేల ఐటీ ఉద్యోగాలు పోయాయి. ఎందుకు పోయాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. సీఎం రేవంత్, విద్యా శాఖ అట్టర్ ఫ్లాప్. అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ అర్థం లేని మాటలు." అని మండిపడ్డారు.

### క్రిమినల్ గవర్నమెంట్

జులై నెల అంతా గోదావరిలో నీళ్లు పోతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు కేటీఆర్. నీళ్లు ఎత్తకుండా రైతాంగాన్ని ఎండబెట్టిన వేస్ట్, క్రిమినల్ గవర్నమెంట్ ఇదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు టీఎంసీలు రాగానే.. హెలికాప్టర్ వేసుకొని వెళ్లి ఉత్తమ్ కుమార్ పోజులు కొట్టిండని ఎద్దేవా చేశారు. "ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు నీళ్లెలా వస్తున్నాయి? గాయత్రి పంప్ హౌస్, నందిమేడారం పంప్ హౌస్ నుంచి కాదా? కాళేశ్వరంపై ఉత్తమ్ కుమార్కు అవగాహన ఉందా? రైతులకు నీళ్లిచ్చే ఉద్దేశం కాంగ్రెస్కు లేదని రైతులకు అర్థమైంది. మంచి వర్షాలు పడాలని ఉజ్జయిని మహంకాళికి మొక్కుకున్నా. రేవంత్ ప్రతీ స్కీం వెనక స్కాం ఉంటది. మెట్రోను ఎందుకు టేకోవర్ చేశాడు? రూ.200 కోట్లు కొట్టేయడానికి రేవంత్, ఆయన సోదరుల స్కెచ్. బీఆర్ఎస్ పాలనలో మెట్రోను అడ్డుకున్నదే కాంగ్రెస్, బీజేపీ. లక్డీకాపూల్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు ట్రాఫిక్ ఉండదని అబద్ధం చెప్పారు. బీఆర్ఎస్ నాయకులను వేధింపులకు గురిచేస్తున్నారు." అని ఆరోపించారు.

# మునిగిపోతున్న తీరప్రాంత నగరాలు



గుర్తించారు. ఈ రెండు కారణాల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. 'టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్' (టీయూఎం), టులేన్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు సగటున ఏడాదికి 6 మిల్లీమీటర్ల మేర సముద్ర మట్టం పెరుగుదల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారని పరిశోధన తెలిపింది. ఇది ప్రపంచ సగటు కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ.ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మందికి పైగా ప్రజలు తక్కువ ఎత్తులో ఉన్న తీర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అలాంటి ప్రాంతాల్లో సముద్ర మట్టం పెరగడమే కాదు, నేల కూడా క్రమంగా దిగజారడం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోందని శాస్త్రవేత్తలు వివరించారు. తీర ప్రాంతాల్లో భూగర్భ జలాలను అధికంగా తోడేయడం, చమురు, సహజవాయువు వెలికితీత, నదీ డెల్టాల్లోని మృదువైన నేల కుంగిపోవడం, భారీ భవనాల బరువు వంటి కారణాలతో భూమి దిగజారుతోందని అధ్యయనం వెల్లడించింది. దీనికి తోడు భూకంప ఫలకాల్లో కదలికలు, మంచు యుగం తర్వాత భూపొరలో జరుగుతున్న సహజ మార్పులు కూడా ప్రభావం చూపుతున్నాయని పేర్కొంది.కొన్ని దేశాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, నైజీరియా, ఈజిప్ట్, చైనా, ఇండోనేషియా తీర ప్రాంతాల్లో ఏడాదికి 7 నుంచి 10 మిల్లీమీటర్ల మేర సముద్ర మట్టం పెరుగుదల నమోదవుతోంది. అమెరికా, నెదర్లాండ్స్, ఇటలీలో ఈ పెరుగుదల 4 నుంచి 5 మిల్లీమీటర్ల మధ్య ఉంది. ఇండోనేషియా రాజధాని జకార్తా అత్యంత ప్రమాదంలో ఉన్న నగరంగా అధ్యయనం పేర్కొంది. అక్కడ సగటున ఏడాదికి 13.7 మిల్లీమీటర్ల మేర నేల కుంగిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో ఈ వేగం 42 మిల్లీమీటర్ల వరకు నమోదైంది. చైనాలోని టియాంజిన్, థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్, నైజీరియాలోని లాగోస్, ఈజిప్ట్‌లోని అలెగ్జాండ్రియా కూడా ప్రమాదకర జాబితాలో ఉన్నాయి.అయితే అన్ని తీర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి లేదని పరిశోధకులు తెలిపారు. స్వీడన్, ఫిన్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భూమి పైకి లేస్తుండటంతో అక్కడ సముద్ర మట్టం ప్రభావం తక్కువగా కనిపిస్తోందని వివరించారు. భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించడం ద్వారా నేల కుంగిపోవడాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచించారు. ఒకప్పుడు ఏడాదికి 10 సెంటీమీటర్లకుపైగా కుంగిపోయిన టోక్యోలో ప్రభుత్వ చర్యలతో పరిస్థితి మెరుగుపడిందని గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు ఇతర దేశాలు కూడా చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# కుంభవృష్టి ఖాయం, ప్రాణనష్టం తప్పదు

పూనిన మాతంగి స్వర్ణలతో భక్తులకు, రాష్ట్ర ప్రజలకు రాబోయే కాలం గురించి హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఏడాది అమ్మావారు సంతోషంగా లేరని తాను క్రోధంతో వచ్చానని స్వర్ణలత స్పష్టం చేశారు. ఎందుకు నన్ను ప్రశ్నిస్తున్నారు? నేను ఎందుకు ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాలి? అంటూ ఆమె ప్రధానార్చకులను నిలదీశారు. భక్తులు తన మాటను ఆచరించడం లేదని కేవలం ప్రశ్నలు అడగడానికే పరిమితం అవుతున్నారని అమ్మవారి తరఫున ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.

### ప్రకృతి వైపరీత్యాలు, ప్రాణనష్టంపై హెచ్చరిక

రాబోయే కాలంలో ప్రకృతి విపత్తులు తీవ్రంగా ఉంటాయని భవిష్యవాణిలో వెల్లడైంది. ముఖ్యంగా ఈ సంవత్సరం కుంభవర్షాలు కురుస్తాయని, వరదల ధాటికి ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడుతుందని స్వర్ణలత హెచ్చరించారు. వర్షాలతోపాటు అగ్ని ప్రమాదాలు కూడా సంభవిస్తాయని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే భారీ ప్రాణ నష్టం తప్పదని ఆమె నొక్కి చెప్పారు.

### విగ్రహ ప్రతిష్ఠకు ఆరు నెలల గడువు

ఈ ఏడాది భవిష్యవాణిలో ప్రధానంగా చర్చకు వచ్చిన అంశం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ. గతంలో ఇచ్చిన మాట ప్రకారం విగ్రహ ప్రతిష్ఠ చేయకపోవడంపై అమ్మవారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహ ప్రతిష్ఠ చేస్తామని చెప్పి ఇప్పటికీ చేయలేదు, నా పట్ల అహంకారం ఎక్కువైంది. అని మాతాంగి స్వర్ణలత వ్యాఖ్యానించారు. వచ్చే ఆరు నెలల్లోగా విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేయాలని, లేని పక్షంలో వాడవాడలా ప్రాణనష్టం జరుగుతుందని హెచ్చరించారు. విగ్రహ ప్రతిష్ఠకు ఎవరు అడ్డు వచ్చినా ఊరుకోనని, వారిని తన పాదాల కింద నలిపేస్తానని ఉగ్రరూపంతో పలికారు. అయితే విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేస్తే భక్తులు కోరిన కోరికలు నెరవేరుస్తానని, వారు కోరింది బంగారం అవుతుందని అభయమిచ్చారు.

### సమాజంలో నైతిక నిలువల పతనం

సమాజంలో మారుతున్న పోకడలపై కూడా అమ్మవారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు వావివరుసలు లేకుండా ప్రవరిస్తున్నారని, ధర్మాన్ని విస్మరిస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణతో పెంచకుండా ఊరిమీద వదిలేస్తున్నారని, ఈ ధోరణి తనకు కంటతడి పెట్టిస్తోందని స్వర్ణలత పేర్కొన్నారు. భక్తులు దోసెడంత ఇస్తే నాకు గోరంత కూడా పెట్టడం లేదు అని తనను కనీసం సంతోషపరచడం లేదని వాపోయారు.సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ బోనాలు ప్రతి ఏటా ఆషాఢ మాసంలో ఎంతో వైభవంగా జరుగుతాయి. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి అనంతరం సోమవారం రంగం కార్యక్రమం నిర్వహిస్తారు. రంగం అంటే భవిష్యత్‌ను వెల్లడించడం. మాతంగి స్వర్ణలతో పచ్చి మట్టి కుండపై నిలబడి అమ్మవారు తనలోకి ఆవాహన అయినట్టు భావించి భవిష్యవాణి వినిపిస్తారు. ఈ మాటలను అమ్మవారి ఆదేశాలుగా భక్తులు భావిస్తారు.

# పెద్ది మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది

జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు.

సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

# నా గెలుపు బీజేపీకి గట్టి సందేశం

కానీ, ఉప-ఎన్నికలో ఆ పార్టీకి ఓటర్లు షాకిచ్చారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ తన విజయం బీజేపీ హైకమాండ్‌కు ఓ సందేశమని పేర్కొన్నారు. అంతేకాదు, '30 ఏళ్ల కోట 30 రోజుల్లో కూలిపోయింది' అని ఆయన ఎద్దేవా చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వరుసగా ఐదుసార్లు ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప-ఎన్నిక అనివార్యమైంది.

### బిహార్ సీఎంపై ఆరోపణలు

విద్య, ఉపాధిపై దృష్టి సారించే మంచి నాయకత్వం బిహార్‌కు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. తనకు ఓటు వేసినవారికి ధన్యవాదాలు తెలుపుతూ "ప్రజలు ఈ సందేశాన్ని ఇచ్చారు" అని కిషోర్ అన్నారు. రాష్ట్రం నుంచి వలసలను ఆపడానికి బిహార్ నాయకత్వం కృషి చేయాలని చెబుతూ తనకు మద్దతు ఇవ్వని వారిని కూడా తనవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తానని ఆయన తెలిపారు. అంతేకాదు, నేరచరిత్ర ఉన్న వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేశారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం బిహార్ సీఎంగా సామ్రాట్ చౌదరి ఉన్న విషయం తెలిసిందే. నవంబరు 2025 ఎన్నికల్లో నితీష్ కుమార్ సారథ్యంలోని ఎన్డీయే విజయం సాధించి, అధికారాన్ని నిలబెట్టుకుంది. సీఎంగా నితీష్ కుమార్ బాధ్యతలు చేపట్టినా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆయన రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

### వలసలు ఆగిపోవాలి

"ఇది ఒక ఎమ్మెల్యేను గెలిపించే ఎన్నిక కాదు. బిహార్‌లో విద్య, ఉపాధి కల్పించాలంటే ఒక మంచి వ్యక్తిని ముఖ్యమంత్రిని చేయాలనే సందేశాన్ని బీజేపీ అగ్ర నాయకత్వానికి పంపే ఎన్నిక ఇది. ఈ సందేశాన్ని ప్రజలు ఇచ్చారు.

నాకు ఓటు వేసిన ప్రజలకు నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. ఓటు వేయని వారిని నా వైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తాను. కానీ ముఖ్యమైన విషయం ఏమిటంటే, బిహార్‌కు మంచి నాయకత్వం లభించాలి. ఇక్కడి నుంచి వలసలు ఆగిపోవాలి" అని ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్‌లోని దతియా ఉప-ఎన్నికలోనూ బీజేపీకి ఓటర్లు షాకిచ్చారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఘనశ్యామ్ సింగ్ 6 వేలకుపైగా ఓట్ల తేడా బీజేపీ అభ్యర్థిని ఓడించారు. అయితే, గుజరాత్‌లోని మంజల్‌పూర్‌ను మాత్రం బీజేపీ నిలబెట్టుకుంది.

# కర్ణాటక కాంగ్రెస్‌లో తిరుగుబాటు జ్వాల

ఇండి ఎమ్మెల్యే యశవంతరాయగౌడ పాటిల్ విధాన సౌధలో డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణిని స్వయంగా కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. దశాబ్దాలుగా పార్టీకి నమ్మకమైన సేవకులుగా ఉన్నప్పటికీ అధిష్ఠానం తమ పట్ల తీవ్ర అన్యాయం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాటిల్ రాజీనామా వార్త వెలువడగానే బెంగళూరు వీధుల్లో ఆయన మద్దతుదారులు, అనుచరులు భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వీధుల్లో ధర్నాలు నిర్వహించడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.మరొకవైపు, సాగర్ నియోజకవర్గం నుంచి గెలిచిన బెళూరు గోపాలకృష్ణ సైతం శాసనసభ స్థానానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడంతో కాంగ్రెస్ వర్గాల్లో కలకలం మరింత తీవ్రతరమైంది. వీరితో పాటు మంత్రివర్గంలో చోటు ఆశించి భంగపడ్డ మరికొందరు సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు సైతం తమ అనుచరులతో అత్యవసర సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రాంతీయ, సామాజిక సమీకరణాల పేరుతో తమను పక్కనపెట్టి ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వడంపై కాంగ్రెస్ అంతర్గత వర్గాల్లో పెద్ద ఎత్తున అసంతృప్తి రగులుతోంది. మొత్తం 20 మందితో నూతన మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లోక్ భవన్‌లో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసిన తరుణంలో ఈ సడన్ రాజీనామాలు కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారాయి. సీఎం డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టిన రెండు నెలల తర్వాత జరుగుతున్న ఈ విస్తరణ పార్టీలో ఐక్యతను తెచ్చేందుకు బదులు తీవ్ర అంతర్గత విభేదాలను బహిర్గతం చేసింది. ఈ పరిణామంతో అప్రమత్తమైన కాంగ్రెస్ అధిష్ఠానం , సీఎం డీకే శివకుమార్ అసంతృప్త నేతలను బుజ్జగించేందుకు శరవేగంగా రాయబారాలు ప్రారంభించారు. రాబోయే శాసనసభ సమావేశాలు, పరిపాలనపై దృష్టి పెట్టాల్సిన సమయంలో సొంత ఎమ్మెల్యేల రాజీనామాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్ర ప్రతిరక్షణలో పడేశాయి. ఈ తిరుగుబాటు మరింత విస్తరిస్తే ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ వర్గాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో, సీఎం డీకే శివకుమార్, కాంగ్రెస్ అధినాయకత్వం ఈ తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎలా అధిగమిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఇంటింటికీ వెళ్లకుంటే.. అటునుంచి ఇంటికే

ముఖ్యంగా రాయలసీమలో ఈ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని నివేదికలు అందాయి. చిత్తూరు జిల్లాలో మాత్రం ఈ కార్యక్రమం కొంత వరకూ బాగానే జరిగినట్లు తెలిసింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మాత్రం భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా నేటి నుంచి ప్రారంభించనున్నారు. కొందరు మై టీడీపీ యాప్ లో ఫొటోలు కూడా అప్ లోడ్ చేయకపోవడంతో సీరియస్ అయినట్లు తెలిసింది. ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి ఫీడ్ బ్యాక్ పంపమని చెప్పినా తక్కువ మంది మాత్రమే పంపినట్లు గుర్తించి చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు.

# నిమ్స్‌కు అరుదైన ఘనత

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమ్స్ వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘనత తెలంగాణలో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి రొబోటిక్ సర్జరీలను సాధారణ ప్రజలకు అందించడం ప్రజారోగ్య రంగంలో ఒక కీలక మలుపుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సహా అన్ని విభాగాలను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. నిమ్స్‌లో నిర్వహించిన మొత్తం 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సల్లో 590 యూరాలజీ, 248 సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, 162 సర్జికల్ ఆంకాలజీ విభాగాల్లో జరిగాయి. మూత్రపిండాలు, జీర్ణాశయం, కాలేయం, ప్యాంక్రియాస్, కొలొరెక్టల్, గైనకాలజీ, క్యాన్సర్ సంబంధిత క్లిష్ట శస్త్రచికిత్సలను రొబోటిక్ టెక్నాలజీతో విజయవంతంగా నిర్వహించారు.రొబోటిక్ సర్జరీల వల్ల శస్త్రచికిత్సల్లో కచ్చితత్వం పెరగడంతో పాటు రక్తస్రావం, శస్త్రచికిత్స అనంతర నొప్పి తగ్గుతుందని, ఆస్పత్రిలో ఉండే రోజుల సంఖ్య తగ్గి రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అత్యంత విశేషమైన విషయం ఏమిటంటే ఈ 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఇటీవలే 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్ ఆస్పత్రి ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం మరో చారిత్రక విజయమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను కూడా నిమ్స్ విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గుర్తు చేశారు. కొత్త టిమ్స్ ఆస్పత్రులు, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో కూడా రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారానే ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# వరద నీటిని సద్వినియోగం చేసుకోండి

కృష్ణానదిలో కొద్ది రోజులుగా ప్రవాహాలు మొదలైనట్లు వివరించారు. అలాగే గోదావరిలో వరద పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అధికారులు వివరించారు.

### ఎగువ నుంచి వచ్చే వరదను సద్వినియోగం చేసుకోవాలి

కృష్ణా బేసిన్‌లో ఎగువ నుంచి వచ్చే వరదను సద్వినియోగం చేసుకునేలా నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వర్షాభావం వల్ల రానున్న రోజుల్లో పశుగ్రాసం కొరత వచ్చే అవకాశం ఉందని దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ తాగునీటి పరీక్షలు జరపాలని ల్యాబ్ టెస్టుల నివేదికలను విడుదల చేయాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

### ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ పరీక్షలను తొలగించాలి

రవాణ శాఖలో పూర్తి స్థాయి టెక్నాలజీ వినియోగం, అనవసర నిబంధనల తొలగింపు వంటి అంశాలకు తీసుకుంటున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్, ఫారం-5బి వంటి పరీక్షలను తొలగించడం వంటి చర్యల ద్వారా అవినీతిని తగ్గించడం, సులభతర సేవలను అందించే అవకాశం కలుగుతుందని అధికారులు సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. దశలవారీగా రవాణా శాఖలో ఈ సంస్కరణలు చేపట్టేలా తాము ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. వీలైనంత మేరకు అనవసర నిబంధనలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో మరో ట్విస్ట్

తాజాగా ఆయన ఇంట్లో తనిఖీలు చేస్తే కీలక విషయాలు బయటపడ్డాయి. మరో మహిళతో ఉన్న సంబంధాలు బహిర్గతమయ్యాయి. దీంతో పోలీసులు మరింత డీప్‌గా డిగ్ చేస్తున్నారు. మహిళ ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు సహచర ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు వేగాన్ని పెంచారు.

విచారణను నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్యనాయక్ జాదవ్ పర్యవేక్షిస్తున్నారు. ఈ విచారణ తీవ్రత పెరుగుతున్న కొద్దీ కీలక విషయాలు వెలుగు చూస్తోంది. బాధితురాలు ఇచ్చిన సమాచారంతో ఉదయ్ కృష్ణారెడ్డి ఉండే గదిలో పోలీసులు సోదాలు చేపట్టారు. అశోక్‌నగర్‌లో ఉండే ఈ నివాసంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్టు చెప్తున్నారు. కృష్ణారెడ్డి గదిలో సోదాలు చేసిన పోలీసులకు ఆయనకు మరో మహిళతో ఉన్న సంబంధం వెలుగు చూసింది. ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

రెండు ప్రేమ లేఖలు కూడా ఆయన గదిలో లభ్యమయ్యాయి. దీనిని పరిశీలించిన అధికారులు వేరే మహిళతో కృష్ణారెడ్డి ప్రేమాయణం సాగించినట్టు తేల్చారు. ఆమెకు 2014లో వివాహమైంది. ఒక కుమారుడు కూడా ఉన్నాడు. అయితే 2023లో భర్త నుంచి విడిపోయి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండేది. అయితే ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. తర్వాత ఆ ఉద్యోగానికి రాజీనామా చేయించి అశోక్‌నగర్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో ఉద్యోగం కల్పించాడు. తర్వాత లివ్ ఇన్ రిలేషన్ కోసం ప్రయత్నించాడు. అయితే ఆమెకు ఇంకా విడాకులు మంజూరు కాకపోవడంతో ఆయన ప్రపోజ్‌ను తిరస్కరించింది.

ప్రస్తుతం కేసు పెట్టిన బాధితురాలు కూడా సదరు మహిళను కలిశారు. తాను కూడా కృష్ణారెడ్డి బాధితురాలినేనని చెప్పారు. తనతో కూడా అతిగా ప్రవర్తిస్తున్నాడని ఆమె వాపోయారని మహిళా ట్రైనీ ఐపీఎస్ చెప్పినట్టు తెలుస్తోంది. ఆమెతోపాటు మరో 20 మంది నుంచి కూడా వాంగ్మూలాలను తీసుకున్నారు. ట్రైనింగ్‌లో ఉన్నప్పుడు కూడా కృష్ణారెడ్డిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. అతి ప్రవర్తన కారణంగా చాలా మంది ఇబ్బంది పడ్డారు. ఈ విషయాలు తెలుసుకున్న పోలీసులు మరింత సమాచారం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం ఆయన్ని కస్టడీలోకి తీసుకొని విచారించాలని చూస్తున్నారు.

# నిరుద్యోగుల మెరుపు సమ్మె

**హైదరాబాద్** ఇందిరా పార్క్ చౌరస్తాలో నిరుద్యోగులు ల మెరుపు ధర్నాకు దిగారు. 7,437 పోస్టులతో కాకుండా 19 వేల పోలీస్ ఉద్యోగాలకు మరో నోటిఫికేషన్ విడుదల చేయాలి . పోలీస్ ఉద్యోగాల వయోపరిమితి పెంచాలంటూ డిమాండ్ చేసారు. నోటిఫికేషన్ ఆలస్యంతో వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. పోలీస్ నోటిఫికేషన్లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేసారు. దరఖాస్తు రుసుమును వెంటనే తగ్గించాలని, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నిరుద్యోగుల హెచ్చరించారు.

## సీఆర్డీయే అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష





**అమరావతి** సచివాలయంలో సీఆర్డీఏ ఇంజినీర్లు,కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యకరమానికి ఏజీఐసీఎల్ ఎండీ అభిషేక్ కుమార్,ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాలరెడ్డి,చీఫ్ ఇంజినీర్లు తదితరులు హాజరయ్యారు. అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల పనుల పురోగతిపై చర్చ జరగింది. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్ల పనులు జరుగుతున్న తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు.వర్షాకాలంలోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**విజయవాడ** హిందూపురం ఘటనకు నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బెజవాడ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులు బహిష్కరణ నిర్వహించారు. హిందూపురంలో అడ్వకేట్ను పోలీసులు కాలుతో తన్నిన ఘటనపై నిరసన వ్యక్తం చేసారు. బాధితుడు న్యాయవాధి అని తెలిసినా దాడి చేసి సీఐ రాజగోపాల్ నాయుడు దూషించాడని ఆరోపించారు. న్యాయవాదులపై పోలీసుల దురాగతాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని బార్ అసోసియేషన్ పేర్కొంది, పోలీసుల తీరుకు నిరసనగా విధులు బహిష్కరణకు బార్ అసోసియేషన్ పిలుపు నిచ్చింది. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకుని రావాలని రెండు రోజుల క్రితం న్యాయవాదులు ధర్నా చేపట్టారు.

## ఎరువుల సొసైటీలో చోరీకి యత్నం

**నిజామాబాద్** నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం నాగేపూర్ ఎరువుల సొసైటీలో తాళం పగులగొట్టి ముగ్గురు దుండగులు లోపలికి దూరారు. లోపల నగదు, విలువైన వస్తువులు దొరకక పోవడంతో వెనుదిరిగారు. దొంగలకు సంబంధించిన కదలికలు సీ సీ ఫుటేజ్ లో దృశ్యాలు రికార్డు అయ్యాయి.

# ఉరవకొండలో ఉద్రిక్తత

**– మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అరెస్ట్**

**ఉరవకొండ** సోమవారం నాడు ఉరవకొండ వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం.. తోపులాట జరిగింది. అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మంత్రి పయ్యావుల కేశవ్ కుట్ర రాజకీయాలకు నిరసనగా వైసీపీ ధర్నా కు ప్రయత్నించింది. వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఉరవకొండలో పోలీసులు ఉరవకొండలో భారీగా మోహరించారు.
విడపనల్ మండలం వేల్పుమడుగులో వైసీపీ నేత గోవిందుకు చెందిన 21 ఎకరాల భూమిని ఆలయ భూమిగా కూటమి నేతలు పేర్కొంటున్నారు.ఆ భూమి ప్రైవేటు భూమి అని రెవెన్యూ అధికారులు స్పష్టం చేసారు. ఈ మేరకు . వైసీపీ నేతకు అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.అయినా మంత్రి పయ్యావుల కేశవ్ ఒత్తిడితో హైకోర్టు ఆదేశాలు అధికారులు ఖాతరు చేయలేదని మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసారు. నిరసనగా ఉరవకొండలో ధర్నాకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు.

## మునిగిపోనున్న సంగమేశ్వరుడు

**నంద్యాల** ప్రసిద్ధి చేందిన సంగమేశ్వరం దేవాలయం శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్స్ లో జలాధివాసానికి చేరువలో ఉన్నది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్ట్ లో 849.6 అడుగులు నీటి మట్టం ఉన్నది.. 841 అడుగులు చేరుకోగానే గర్భ గుడిలోకి నీళ్లు ప్రవేశిస్తాయి.867 అడుగులు శ్రీశైలం నీటి మటం చేరగానే గుడి మొత్తం మునిగిపోతుంది. మరల 8 నెలలు తరవాత దర్శనం కి వీలు పడ్తుంది.

## లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం

**– ఒకరు మృతి,మరొకరి పరిస్థితి విషమం**

**తిరుపతి** నాయుడుపేట పూతలపట్టు ప్రధాన రహదారిలోని తిరుపతి రూరల్ మండలం,ఓటేరు సమీపంలోని సెవెన్ హిల్స్ హోటల్ వద్ద ఆదివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న కట్టెల లోడు లారీ ని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. మృతుడు అగ్రహారం పంచాయతీ వినాయక నగర్ చెందిన సురేష్ (26) గా గుర్తించారు. అదే గ్రామానికి చెందిన వంశీ ఆచారి తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై బాధితుల ఫిర్యాదుతో తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసారు.

## వికారాబాద్ వెంచర్లలోని ప్లాట్లను నిషేధిత జాబితా నుండి తొలగించాలి

**- కలెక్టర్కు వినతిపత్రం అందజేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు**

**- మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో వినతి**

**వికారాబాద్** వికారాబాద్ జిల్లాలోని పలు వెంచర్లలో ఉన్న ప్లాట్లను నిషేధిత ఆస్తుల జాబితా నుండి తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్లో వినతిపత్రం అందజేశారు.మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో వికారాబాద్కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ని కలిశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు.వికారాబాద్ పరిధిలోని పలు వెంచర్లలో సాధారణ ప్రజలు కొనుగోలు చేసిన ప్లాట్లు గత కొంతకాలంగా నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, దీంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

"వెంటనే ఈ ప్లాట్లను నిషేధిత జాబితా నుండి తొలగించి, రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాలి. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు వేలాది మంది సామాన్యుల సమస్యలు పరిష్కారమవుతాయి" అని వారు విజ్ఞప్తి చేశారు.కలెక్టర్ దీపక్ తివారి, అధికారులతో చర్చించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## సి.బెలగల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

**– సిపిఐ డిమాండ్**




**సి.బెలగల్,** కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా, సి.బెలగల్ మండలాన్ని కరువు మండలంగా వెంటనే ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు.ఈ మేరకు సోమవారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సి.బెలగల్ తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా ఉందన్నారు. ముఖ్యంగా సి.బెలగల్ మండలంలో శాశ్వత నీటి వనరులు లేకపోవడంతో రైతులు పూర్తిగా వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని తెలిపారు.ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని, ఇప్పటికే వేలాది మంది రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలపై పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతుల నుంచి పంటల బీమా ప్రీమియం వసూలు చేయడం అన్యాయమని, పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరించాలని డిమాండ్ చేశారు. రైతులపై అదనపు ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వం ప్రత్యక్ష సహాయం అందించాలని కోరారు.ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వర్షాలు కురిసిన వెంటనే రైతులు తిరిగి సాగు ప్రారంభించేందుకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు.అదేవిధంగా కరువు ప్రభావంతో పశువులకు మేత కొరత ఏర్పడినందున మూగజీవాలకు పశుగ్రాసం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేసి, ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరువు కారణంగా ఇబ్బందులు పడుతున్న రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 15 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు నల్లన్న, మండల సహాయ కార్యదర్శులు పకీరప్ప, శేషు, మండల కార్యదర్శి మల్లికార్జున, బాలు, రవి, చిన్న ఈరన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## బద్వేల్ పెద్ద చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



**బద్వేలు** బద్వేల్ పట్టణం పెద్ద చెరువులో సోమవారం ఒక వివాహిత మహిళా దూకి ఆత్మహత్య చేసుకుంది పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బద్వేల్‌కు చెందిన ఆదిలక్ష్మి (50) అనే మహిళ గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురవుతోంది. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన ఆమె, ముందుగా పేడలో చల్లుకునే పురుగుల మందు (పౌడర్) తాగింది. అనంతరం పట్టణంలోని పెద్ద చెరువు వద్దకు చేరుకుని అందులోకి దూకేసింది.గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ, ఆమె అప్పటికే నీట మునిగి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న బద్వేల్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులోంచి బయటకు తీశారు. అనంతరం కేసు నమోదు చేసుకుని, శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## ఈనెల ఏడున నేతన్న సేవలో పథకం

**– మంత్రి సవిత**

**అమరావతి** రాష్ట్ర సచివాలయంలో నేతన్న సేవలో పథకంపై మంత్రి సవిత సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చేనేత, జౌళి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖా రాణి, వివిధ జిల్లాలకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ నేతన్న సేవలో పథకం కింద చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం ఇస్తున్నాం. అర్హులైన నేతన్నలందరికీ నేతన్న సేవలో పథకం అమలు చేస్తాం. ఈ నెల 7న చేనేత జాతీయ దినోత్సవం సందర్భంగా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టాం. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులకు గడువు .గడువులోగా అర్హులైన నేతన్నలు దరఖాస్తులు చేసుకోవాలి. అర్హులైన నేతన్నలందరికీ నేతన్న సేవలో పథకం వర్తింపజేసేలా జిల్లాలో చేనేత, జౌళి శాఖాధికారులు కృషి చేయాలని అన్నారు.నేతన్నల గౌరవప్రదమైన జీవనం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం . ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని అన్నారు.

## సీఎం చంద్రబాబు నాయుడుకి లేఖ రాసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య..

**– టిఎంఎఫ్ పేరుతో వెనక్కి తీసుకుంటున్న తల్లికి వందనం నిధులను సక్రమంగా వినియోగించాలి..**

అమరావతి.: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలన్నింటిలో మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి పరచేందుకు తగు చర్యలు చేపట్టాలి.రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం క్రింద విద్యార్థుల పేరుతో వారి తల్లిదండ్రులకు ఇచ్చే రూ.15 వేల ఆర్థిక సాయంలో ప్రతి ఒక్కరి నుండి రూ.2 వేల చొప్పున మరుగుదొడ్ల నిర్వహణ నిధులు (టిఎంఎఫ్) పేరుతో కోత విధిస్తూ, కేటాయించిన నిధుల నుంచే ప్రతియేటా సుమారు రూ.1000 కోట్లను టిఎంఎఫ్ పేరుతో తిరిగి తీసుకుంటోంది. ఈ ఏడాది తల్లికి వందనం క్రింద రూ.10,120.78 కోట్లు కేటాయించారు.. అందులో రూ.1,349.43 కోట్లను టిఎంఎఫ్ పేరుతో లబ్దిదారుల నుంచి వెనక్కి తీసుకోవడం జరిగింది. టిఎంఎఫ్ పేరుతో నిధులు కేటాయిస్తున్నప్పటికీ రాష్ట్రంలోని వేలాది పాఠశాలల్లో నేటికీ మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం శోచనీయం. టిఎంఎఫ్ నిధులు ఏ రకంగా, ఎందుకోసం వినియోగిస్తున్నారో తెలియని ప్రశ్న తలెత్తుతోంది.రాష్ట్రవ్యాప్తంగా వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్య నెలకొంది. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 44,222 ఉన్నాయి. అందులో బాల, బాలికలు కలిసి చదువుకునే పాఠశాలలు 43,784 ఉన్నాయి. వీటిల్లో బాలురకు 6,050 పాఠశాలల్లో, 624 పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్ల సౌకర్యం లేదు.అంతేకాకుండా 35,452 పాఠశాలల్లో వికలాంగ విద్యార్థులకు అనుకూలమైన మరుగుదొడ్లు లేవు. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు బహిర్భూమి కోసం సూళ్లకు దగ్గరలో ఉన్న చెట్లు కలిగిన ప్రదేశాలకు గానీ, ఇళ్లగానీ వెళ్లాల్సిన దుస్థితి నెలకొనడం విచారకరం. మరికొన్ని పాఠశాలల్లో పేరుకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేకపోయింది. ఆయా మరుగుదొడ్లలో నీటి సౌకర్యం లేకపోవడం, నిర్మాణ సమస్యలు వెలుగుచూస్తున్నాయి. రాష్ట్రంలోని 155 ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా చాలా వరకు ఎయిడెడ్ పాఠశాలల్లోనూ సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల విద్యార్థులకు సరిపడా లేకపోవడం, మరికొన్ని చోట్ల నిర్వహణ కరువై పాడవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోంది. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి సూచనతో విద్యార్థుల పనితీరును మెరుగుపరచడానికి ఇటీవల మెగా పేరెంట్‘టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించినా ఫలితం లేదు. రాష్ట్రంలోని వేలాది పాఠశాలల్లో మరుగుదొడ్లను నిర్మించకుండా, ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకుండా పదేపదే సమావేశాలు నిర్వహించినప్పటికీ ప్రయోజనం ఉండదు. కావున మీరు తక్షణమే స్పందించి, టిఎంఎఫ్ నిధులను సక్రమంగా వినియోగించి, రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు సమగ్ర మౌలిక వసతులు కల్పించి, పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు చేపట్టవలసిందిగా కోరుతున్నాను.

## ఎంపి చిన్ని జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**విజయవాడ** విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ చిన్ని పుట్టినరోజు వేడుకలు నందిగామ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నియోజకవర్గ పరిశీలకులు తల్లా వెంకటేష్ యాదవ్ , కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి వారి కార్యాలయంలో కేక్ కట్ చేసి ఎంపీ చిన్ని కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కూటమి ప్రభుత్వంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని చేస్తున్న కృషిని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్న నేపథ్యంలో, ప్రజా ప్రతినిధులంతా సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గాల అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.
కూటమి నాయకత్వం, కార్యకర్తల మధ్య ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఎంపీ కేశినేని చిన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొని ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గిరిజన పేద ప్రజలకు భూములు పంపిణీ చేయాలి

**– గిరిజన సమాఖ్య డిమాండ్, వినతి పత్రం సమర్పణ**




**నరసరావుపేట** :వినుకొండ నియోజకవర్గంలోని గల బొల్లాపల్లి మండలం గండి గనుమల గ్రామ సర్వేనెంబర్ 430 లో ప్రభుత్వ బంజర భూమి ఏ 169.80 సెంట్లు కలదు. కొంతకాలం క్రితం గిరిజన, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేసి అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ మేరకు సర్వే చేస్తామని రెవిన్యూ అధికారులు ఇంతవరకు చేపట్టడం లేదని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో డిఆర్ఓ అద్దయ్యకు సోమవారం వినతి పత్రం అందజేయడం జరిగింది. గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ కి అనేకసార్లు అర్జీలు ఇవ్వడం జరిగింది. నేటి వరకు రెవిన్యూ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆ భూమి కొంతమేరకు గిరిజన ప్రజలు సాగు చేసుకుంటున్నారు. మరి కొంత భూమి బీడుగా ఉంది. నిరుపేదలైన గిరిజన ప్రజలకు భూ పంపిణీ చేస్తే వారి జీవన భృతికి ఉపయోగ పడుతుందన్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమగ్ర సర్వే జరిపి, నిరుపేద గిరిజనులకు భూములు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి కోయ శ్రీన, ఉపాధ్యక్షులు పాలపర్తి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు బి. రాంబాబు నాయక్, తోపాటు పలువురు పాల్గొన్నారు.


## కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

**– సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు.బి. రాజు.**




**సి. బెళగల్.** మండల కేంద్రంలోని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట,భారత కమ్యూనిస్టు పార్టీ ,మరియు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో,కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బి.రాజు మాట్లాడుతూ.కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని,పంట వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని,వర్షాలు పడితే తిరిగి విత్తనాలు వేయడానికి ఉచితంగా విత్తనాలు ఎరువులు ఇవ్వాలని,మూగజీవాలకు పశుగ్రాసం నీటి సౌకర్యాలు కల్పించాలని,గ్రామాల్లో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని,రైతులకు తీసుకున్న అన్ని బ్యాంకులలో వ్యవసాయ రుణాలను రద్దుచేసి,కొత్త రుణాలు ఇవ్వాలని,పంటల భీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి, రైతులు కట్టిన ప్రీమియాన్ని తిరిగి ఇవ్వాలని,కరువు కారణంగా రేషన్ కార్డు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి,చౌకధర దుకాణాల ద్వారా, 15 రకాల నిత్యవసర వస్తువులను,ఉచితంగా పంపిణీ చేయాలని, తొమ్మిది రకాల వినతులను, ప్రభుత్వానికి తెలిపారు. అనంతరం మండల రెవెన్యూ అధికారి ఈరంరెడ్డి వెంకటలక్ష్మికి, సిపిఐ,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సభ్యులు,రైతులందరూ కలిసి వినతి పత్రాన్ని అందించారు.ఎమ్మార్వో వెంకటలక్ష్మి సానుకూలంగా స్పందిస్తూ,మీ యొక్క వినితిని ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ నిరసన కార్యక్రమంలో.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బి రాజు, సిపిఐ కార్యకర్తలు, రైతు సంఘం సభ్యులు, సి.బెళగల్ మండల సిపిఐ కార్యవర్గ సభ్యులు పకీరప్ప, శేషు,మల్లి, చిన్న నాగన్న, రవి, చిన్న ఈరన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 4న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరరెడ్డి 47వ వర్ధంతి సభ




**తుగ్గలి/మద్దికేర:** ప్రజాసేవకుడు మాజీ ఎమ్మెల్యే కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు ఎర్రగుడి ఈశ్వరరెడ్డి 47వ వర్ధంతి సందర్భంగా ఆగస్టు 4న సాయంత్రం 4 గంటలకు యర్రగుడి గ్రామంలోని ఆయన స్తూపం వద్ద ప్రదర్శనతో పాటు బహిరంగ సభను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సి.పి.యం సీనియర్ నాయకులు,ఎర్రగుడి భాస్కర్ రెడ్డి లు తెలిపారు.పేదలు,భూమిలేని నిరుపేదలు,సుగాలి ప్రజల హక్కుల కోసం ఈశ్వరరెడ్డి జీవితాంతం పోరాడారని,గ్రామీణాభివృద్ధి, సాగునీరు,విద్య,మౌలిక సదుపాయాల కల్పనకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు.ఎర్రగుడి పరిసర ప్రాంతాల్లో అటవీ భూములను డి-ఫారెస్టు చేయించి సుమారు 1,200 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.1967లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కె.బి.నరసప్పపై సుమారు 5 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించి 1972 వరకు ఎమ్మెల్యేగా సేవలందించారని తెలిపారు. వర్ధంతి సభకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి,రాష్ట్ర సి.పి.యం కార్యవర్గ సభ్యుడు వి. రాంభూపాల్,సి.పి.యం కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆనంద్ బాబు,ఈశ్వరరెడ్డి మనవడు కె. జగదీశ్వరరెడ్డి,పత్తికొండ నియోజకవర్గ ప్రాంత సి.పి.యం,సి.పి.ఐ నాయకులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి తుగ్గలి, మద్దికేర,పత్తికొండ మండలాల ఈశ్వరరెడ్డి శ్రేయోభిలాషులు, అభిమానులు,కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన తనయుడు యర్రగుడి భాస్కరరెడ్డి,సి.పి.యం సీనియర్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# మహాదేవపూర్‌లోమంగళవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

**జయశంకర్ భూపాలపల్లి.**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ విద్యావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వైద్య శిబిరంలో ఏం ఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రి నుండి క్యాన్సర్ నిపుణులు వస్తారని క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ముందస్తు గుర్తింపు కోసం ఈ నెల 4వ తే మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నారని తెలిపారు.నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఆంకాలజీ డాక్టర్లచే వ్యాధి నిర్ధారణ, అవసరమైన వారికి మెరుగైన చికిత్సపై సలహాలు క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలు, పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పెద్దమ్మతల్లి కి అరకిలో వెండి కిరీటం బహుకరణ

**హుజురాబాద్,** హుజురాబాద్ లోని రంగనాయకుల గుట్ట వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గత సంవత్సరం నిర్మించుకున్న పెద్దమ్మతల్లి ఆలయంలో కి,శే,లు రావనవేణి మురళి (ఎస్. టి. ఓ) గారి జ్ఞాపకార్ధమ్ వారి సతీమణి విమల .కొడుకులు సాయిరాం.వంశీలు అమ్మవారికి అరకిలో వెండి కిరీటాన్ని బహుకరించారు ఈ సందర్భంగా పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి ఆలయ కమిటీ ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో వేదమాత్రాల మధ్య అమ్మవారికి సమర్పించి అలంకరించారు.అనంతరం కిరీట దాతలను సన్మానించిన ముదిరాజ్ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఆషాఢమాసం సందర్బంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో 5 వ తేదీన పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి 6 వ తేదీన శ్రీ పెద్దమ్మతల్లి కి అంగరంగ వైభవంగా భోనాల పండుగ నిర్వహిచబడుతుందని ఈ పండుగ లో పుర ప్రజలు అందరు పాల్గొని పెద్దమ్మతల్లి కృపా కటాక్షాలను పొందాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ముదిరాజ్ సంఘం సభ్యులు గుడ్డేలుగుల సమ్మయ్య. పోచయ్య. గోస్కుల సమ్మయ్య. వెంకన్న.కొలిపాక సమ్మయ్య. మౌటం శ్రీనివాస్.పిల్లి సమ్మయ్య. భూమ్ సాయి కృష్ణ. రావనవేణి రాజేశం. రమేష్.భాస్కర్.బుర్రి శేఖర్ తదితరులు పాల్గొన్నారు...

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**- జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆకుల సంజీవరావు**



**కమాన్ పూర్:** పరిసరాల పరిశుభ్రత పచ్చదనం, ప్రతి ఒక్కరి బాధ్యత అని జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆకుల సంజీవరావు పేర్కొన్నారు. కమాన్ పూర్ మండలం పెంచికల్ పేట గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీఓ ప్రియాంక, గ్రామ సర్పంచ్ పల్లె మాధవి నారాయణతో కలిసి ప్రారంభించి, గ్రామంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మొక్కలను తమ పిల్లల వలే నాటి, సంరక్షించుకోవాలని కోరారు. పచ్చదనంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వారితో గ్రామ ఉప సర్పంచ్, చొప్పరి శేఖర్ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సూది రెడ్డి ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలలో వాలంటీర్ టీచర్ నియామకానికి జియో మైసూర్ సానుకూల స్పందన

**- ఎంఈఓ అందజేసిన వినతిపత్రానికి స్పందించిన జియో మైసూర్ యాజమాన్యం**



**తుగ్గలి** పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలని తుగ్గలి మండల విద్యా శాఖ,స్థానిక నాయకులు సంయుక్తంగా చొరవ తీసుకున్నారు. సోమవారం రోజున జియో మైసూర్ కంపెనీ అధికారులు,తుగ్గలి మండల ఎంఈఓ రామా వెంకటేశ్వర్లు,పాటీల్ ఈశ్వర రెడ్డి మరియు పలువురు స్కూల్ సిబ్బంది కలిసి సమావేశమయ్యారు.సమావేశంలో సిబ్బంది కొరత ఉన్న పాఠశాలల్లో వాలంటీర్ టీచర్‌ను నియమించాలని కంపెనీ అధికారులను విన్నవించారు.ఈ ప్రతిపాదనపై జియో మైసూర్ కంపెనీ అధికారులు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు వాలంటీర్లను నియమించేందుకు కంపెనీ తన వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ చొరవ వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యా నాణ్యత మెరుగుపడటంతో పాటు, ఉపాధ్యాయుల కొరత కూడా తగ్గుతుందని ఎంఈఓ మరియు సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రస్తుత సమాజంలోని ప్రైవేట్ సంస్థలు విద్యారంగానికి చేయూతనివ్వడం అభినందనీయమని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జియో మైసూర్ పిఆర్వో రాజేష్ ఉపాధ్యాయులు సుధాకర్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుడు చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు

## ఏజెన్సీ గిరిజనుల చదువులపై 5 ఏళ్లుగా నిర్లక్ష్యం

**- గత వైసీపీ నిర్లక్ష్యం. ఇప్పుడు కూటమి నిర్లక్ష్యం**



**దేవీపట్నం,** ఏజెన్సీ గిరిజన విద్యార్థుల భవిష్యత్తు గత 5 ఏళ్లుగా అంధకారంలోనే ఉంది. రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం ఇందుకూరు పంచాయతీ చిన్న బింపల్లి స్కూలు దీనికి పెద్ద ఉదాహరణ.5 ఏళ్లుగా పునాదిలోనే భవనం2019-2024 వరకు ఉన్న వైసీపీ ప్రభుత్వంహయాంలో నిధులు మంజూరు చేసి పునాదులు మాత్రమే వేసి వదిలేసింది. 2024లో వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా గత 2 ఏళ్లుగా పనులు పునఃప్రారంభించలేదు.సుమారు 5 సంవత్సరాలుగా ఈ భవనం ఫైలు అలాగే ఉంది.పాకల్లోనే గిరిజన పిల్లల చదువుఫలితంగా 80 మంది గిరిజన విద్యార్థులు గడ్డి పాకలోనే చదువుకోవాల్సి వస్తోంది.- ఎండ, వాన, చలి - అన్నీ భరించవలసిందే బెంచీలు, బ్లాక్‌బోర్డు, మరుగుదొడ్లు లేవు తాగునీటికి కిలోమీటర్ నడవాలి.5 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. మా పిల్లలకు ఒక గది కూడా కట్టించలేదు" అని గిరిజన తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.గిరిజనుల అభివృద్ధి అంటూ నినాదాలు ఇచ్చే కూటమి ప్రభుత్వం స్పందించే స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే జోక్యం చేసుకుని 5 ఏళ్లుగా నిలిచిన బింపల్లి స్కూలు భవనం పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో అసలైన పాత్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే

**- ప్రజలకు అన్ని వాస్తవాలు తెలుసు**

**- వైఎస్సార్‌సీపీ నేత గుడివాడ అమర్‌నాథ్**

**విశాఖపట్నం** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంలో అసలైన పాత్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని వైఎస్సార్సీపీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. భూసేకరణ పూర్తి చేయడం, కోర్టు చిక్కులను తొలగించడం, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం వంటి కీలక నిర్ణయాలు జగన్ హయాంలోనే జరిగాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు, చంద్రబాబు 'కొబ్బరికాయ కొట్టింది నేనే, గుమ్మడికాయ కట్టింది నేనే' అని ప్రగల్భాలు పలుకుతున్నారని, ఎవరైనా కొబ్బరికాయ కొట్టగలరని ఎద్దేవా చేశారు. అసలైన ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను 81% జగన్ ప్రభుత్వం మాత్రమే పూర్తి చేసిందని తెలిపారు.

## రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ప్రభుత్వం ఆర్భాటం చేస్తోంది

**- పరిశ్రమలకు సరైన వాతావరణం కల్పించడంలో పూర్తిగా విఫలమైంది.**

**- ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్**


రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ప్రభుత్వం ఆర్భాటం చేస్తోందే తప్ప, పరిశ్రమలకు సరైన వాతావరణం కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ విమర్శించారు.ఆంధ్రప్రదేశ్‌లో రూ. 6,700 కోట్ల పెట్టుబడితో టాటా పవర్ కంపెనీ ఏర్పాటు కావాల్సి ఉండేదని, కానీ ఇక్కడి పరిస్థితులు నచ్చక తమ ప్రాజెక్టును వారు ఏపీ నుంచి ఒడిశాకు తరలిపోయారని తెలిపారు. ప్రభుత్వం చెబుతున్నట్లు ఇక్కడ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' లేదని, అంతా 'క్యాష్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నడుస్తోందని విమర్శించారు. టాటా వంటి నీతి, నియమాలు పాటించే సంస్థలు లంచాలు ఇవ్వలేక రాష్ట్రం వీడి వెళ్తున్నాయని ఆరోపించారు.

## ప్రజలను తప్పు త్రోవ పట్టిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**రామడుగు:** బిఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు తో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ హయాంలో కట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి విడుదల చేసిన నీళ్లను కాళేశ్వరం నీళ్లు అని తెలంగాణ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకుల వైఖరిని ఖండిస్తూ రామడుగు మండల కాంగ్రెస్ అధ్యక్షులు జవ్వాజి హరీష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయం లో గోదావరి నది మీద శ్రీరాం సాగర్ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు లను నిర్మించి తెలంగాణ ను సస్యశామలం చేయడం జరిగిందన్నారు.ఈ బిఆర్ఎస్ అధికారం లో వున్నప్పుడు లక్ష కోట్ల ప్రజా ధనాన్ని వృధా చేసి కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు అది కుంగి పోయిందని నీటిని ఎత్తితే ప్రాజెక్టు భారీ ప్రమాదానికి గురి అవుతుందని జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డిఎస్ఏ) స్వయంగా నివేదిక పంపించడం జరిగిందన్నారు. కానీ ఈ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసిన రాష్ట్ర ప్రజలు మీ నాయకుడిని మీ పార్టీని రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ నువ్వు ఎన్ని విష ప్రచారాలు చేసిన ఈ సారి నియోజక వర్గం లో నీకు డిపాజిట్ కూడా రాదని అసలు నీకు ఫస్ట్ మీ పార్టీ లో టికెట్ ఇస్తారో లేదో అనే అనుమానం మీదనే వుందట మీ అధిష్ఠానం నువ్వు కూడా నీతులు చెప్తే ఎలా అని మండల కాంగ్రెస్ అధ్యక్షులు జవ్వాజి హరీష్ ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోల రమేష్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఆరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్ప శ్రీనివాస్ రెడ్డి మంత్రి మహేందర్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ నాగభూషణ్ రెడ్డి సువిన్ యాదవ్ ఉప్పని అంజని ప్రసాద్ ఆరు మండలాల మార్కెట్ కమిటీ పాలకవర్గం సింగిల్ విండో పాలకవర్గం రైతులు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి** ప్రజావాణి వినతుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ దరఖాస్తులను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ?కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి ఆయన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 81 దరఖాస్తులు రాగా, వాటిని తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు తెలిపారు.?పెండింగ్ అర్జీలపై సమీక్ష జిల్లా స్థాయి ప్రజావాణికి సంబంధించి గత వారం వరకు ఉన్న 144 దరఖాస్తులు, అలాగే సీఎం ప్రజావాణి నుంచి వచ్చిన 47 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తులతో పాటు, కొత్తగా వచ్చిన వినతులను రాబోయే వారం రోజుల్లోగా వేగవంతంగా పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఖరాఖండిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షిణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**రామడుగు** రామడుగు మండలం వన్నారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ రేణుక మాట్లాడుతూ తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి క్లుప్తంగా వివరించారు. గర్భవతులు బాలింతలు మంచి పోషకాహారం తీసుకోవాలని పిల్లలు పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం మొదలు పెట్టాలని పిల్లలకు రెండు సంవత్సరాలు నిండే వరకు ఖచ్చితంగా తల్లిపాలు కొనసాగిస్తూ పిల్లలకు మంచి పోషక ఆహారం తినిపించాలని ముర్రుపాలు తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తల్లులకు సూపర్వైజర్ రేణుక వివరించారు.ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు బాలా మృతం తప్పకుండా తినిపించాలని మూడు నుండి ఐదు సంవత్సరాల పిల్లలందరినీ అంగన్వాడికి ప్రీస్కూల్ కు పంపించాలని తల్లులను కోరారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వన్నారం సర్పంచ్ గుంట ఓదెలు (ఐసీడీస్)సూపర్వైజర్ పి.రేణుక స్కూల్ హెచ్ఎం స్కూల్ టీచర్ సెక్రటరీ నవిత అంగన్వాడి టీచర్లు శ్రీదేవి భారతి ఆయాలు తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.


## అభివృద్ధిసంక్షేమంలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి

**- బద్వేలు టిడిపి ఇంచార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి**



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గం,అట్లూరు మండలం,అట్లూరు క్రాస్ రోడ్ లో సోమవారం నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రజలను నేరుగా కలిసి గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎవరికి అయినా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. సంక్షేమం కోసం ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎక్కడా వెనకడుగు వేయడం లేదన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆదాయ వనరులు తక్కువగా ఉన్నప్పటికీ అభివృద్ధి మరియు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.×అభివృద్ధి విషయంలో గతంలో ఎన్నడూ లేనంతగా గుంతలు లేని రహదారుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. అలాగే అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు భోగాపురం విమానాశ్రయం ప్రారంభం కూడా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడిందన్నారు.ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, అట్లూరు మండల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధి పట్ల ఎంఈఓ అభినందనలు



**పిడుగురాళ్ల,** :పిడుగురాళ్ల మండల విద్యాశాఖ అధికారి ఎండి. ఖాసిం సోమవారం పట్టణంలోని మండల ప్రాథమిక పాఠశాల (ఎస్టీ) కాలనీ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అందరు విద్యార్థులు ఏకరూప (యూనిఫామ్) దుస్తులు, షూస్ తో సమయపాలన పాటిస్తూ హాజరు కావడం పట్ల విద్యార్థులను అభినందించారు. పాఠశాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. ప్రసాద్ రావు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పాఠశాల మంచి వాతావరణం లో, మంచి మంచి సూక్తులతో, వరండా బయట కూడా మంచి బొమ్మలతో ఏర్పాటు చేయడంతో పాటు, పాఠశాలలో చక్కగా మొక్కలు నాటడం, విద్యార్థులను మంచి క్రమ శిక్షణలో పెట్టడం, దాతల సహకారంతో చక్కటి గేటు ఏర్పాటు చేయడం , ప్రధానోపాధ్యాయులు సైతం పూర్తిగా తరగతులు బోధించడం పాఠశాల అభివృద్ధికి ప్రధాన కారణమని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుని ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం పరిశీలించి, 100% విద్యార్థులు మధ్యాహ్నబడి భోజనం చేయటం పట్ల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొలిమిగుండ్లలో టిడిపి ఇంటింటా ప్రచారం

**- పాల్గొన్న టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి...**



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో ఇవాళ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి నాయకులు కార్యకర్తలతో కలిసి టిడిపి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను మూలే రామేశ్వర్ రెడ్డి ప్రజలకు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆయన అన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను మూలే రామేశ్వర్ రెడ్డి ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, లోకేపల్లి మధు ప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, బొట్టు స్వామి, వెంకటరాముడు, చికెన్ వెంకటేష్, శ్రీనివాసులు, రవి, చంద్ర, నాగేశ్వరరావు, నడిపి దస్తగిరి, డిష్ గోపాల్ ఇంకా టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**కొలిమిగుండ్ల** .కోయలకుంట్ల మండలం పొట్టిపాడు గ్రామంలో సోమవారం రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యటించారు. గ్రామానికి చేరుకున్న మంత్రికి స్థానిక టిడిపి నాయకులు పూలతో ఘనస్వాగతం పలికారు. రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పంపిణీ చేశారు. నూతన పట్టాదారు పాస్ పుస్తకాలలో గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా ఎవరి ఫోటో లేకుండా, రాజముద్ర తో కూడిన పాసుపుస్తకాలు పంపిణీ చేసినట్లు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకుడు సుబ్బారెడ్డి, ఇంకా తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లన్నసాగర్ భూనిర్వాసుల భవన నిర్మాణ కార్మిక సంఘానికి నష్టపరిహారం చెల్లించాలి : సీపీఐ డిమాండ్




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మల్లన్నసాగర్ ప్రాజెక్టు ముంపుతో నష్టపోయిన పల్లెపహాడ్ గ్రామ భవన నిర్మాణ కార్మిక సంఘానికి ప్రభుత్వం వెంటనే తగిన నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు.ప్రభుత్వం చేపట్టిన మల్లన్నసాగర్ ప్రాజెక్టు కారణంగా పల్లెపహాడ్ గ్రామంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనం ముంపునకు గురైందని, అయితే ఇప్పటివరకు ఆ సంఘానికి ఎలాంటి నష్టపరిహారం అందించలేదని ఆయన ఆరోపించారు. అలాగే గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహాడ్ పునరావాస ప్రాంతంలో భవన నిర్మాణ కార్మిక సంఘానికి ఒక ఫ్లాట్ కేటాయించి, సంఘం భవనాన్ని నిర్మించి ఇవ్వాలని కోరుతూ గజ్వేల్ ఆర్‌డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లెపహాడ్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గూడూరు స్వామి, ఉపాధ్యక్షుడు శనిగరం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి శివలింగ స్వామి, సహాయ కార్యదర్శి రుద్రారం మల్లేశం, అలాగే ఎల్లం భూమయ్య, పోచయ్య, మల్లేశం, సాయిలు, రాజయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

**- ముర్రుపాలు శిశువుకు తొలి రక్షణ కవచం**

**- అవగాహన కల్పించిన వైద్య సిబ్బంది**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ మండలం బయ్యారం గ్రామంలో సర్పంచ్ శ్రీమతి మైసని కళ్యాణి--ప్రశాంత్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు (కలస్ట్రమ్) తప్పనిసరిగా తాగించాలని సూచించారు. ముర్రుపాలు తాగడం వల్ల శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు. అలాగే తల్లిపాలు తాగడం వల్ల బిడ్డకు మేధో వికాసం మెరుగుపడటంతో పాటు, తల్లి--బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని తెలిపారు.తల్లిపాలు పూర్తిగా శుభ్రమైనవి, పోషకవిలువలు అధికంగా కలిగినవి, ఖర్చులేనివి అని పేర్కొన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో అవసరమైన అన్ని పోషకాలు, నీరు కూడా తల్లిపాల ద్వారానే అందుతాయని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు అనిత, రుదిని, ఏఎన్ఎం వి. అనిత, ఆశా కార్యకర్తలు అరుణ, మెట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి

**అత్యంత విషాదకరం జగిత్యాల**

**ఎమ్మెల్యే సంజయ్ , కలెక్టర్ సత్య ప్రసాద్**



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ఎంపీపీఎస్ ఒడ్డెర కాలనీ పాఠశాలలో చదువుతూ సమీకృత బాలుర వసతి గృహంలో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందడం అత్యంత విషాదకరమని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.సోమవారం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మృత విద్యార్థుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఘటనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, మల్యాలలోని ఎంపీపీఎస్ ఒడ్డెర కాలనీ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు విరామ సమయంలో ఎవరికి సమాచారం ఇవ్వకుండా పాఠశాల ఆవరణ నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపారు. కొంతసేపటి తర్వాత వారు పాఠశాలకు తిరిగి రాకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు, హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు గాలింపు చర్యలు చేపట్టారని చెప్పారు.గాలింపు సందర్భంగా పాఠశాల, హాస్టల్‌కు సమీపంలోని కొత్తకుంట వద్ద విద్యార్థుల దుస్తులు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించామని తెలిపారు. అనంతరం పోలీసు శాఖ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో కలిసి కుంటలో గాలింపు చేపట్టగా, దురదృష్టవశాత్తు ఇద్దరు విద్యార్థులు మృతి చెందినట్లు గుర్తించి మృతదేహాలను వెలికితీసినట్లు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్, సంఘటనకు దారితీసిన పరిస్థితులను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. విచారణలో ఎవరి నిర్లక్ష్యం ఉన్నా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రభుత్వం తరఫున అందాల్సిన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్న ఆయన, విచారణలో విధుల్లో నిర్లక్ష్యం తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజకుమార్, డి ఈ ఓ రాము, ఇతర అధికారులు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

**సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయండి**

**పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



పటాన్చెరు (ప్రశ్న న్యూస్ ) పటాన్చెరు, గుమ్మడిదల మండల పరిధిలోగల గ్రామాలలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.సోమవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పటాన్చెరు, గుమ్మడిదల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, పిఆర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని తెలిపారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను తన దృష్టికి తీసుకొని వస్తే.. పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.గుమ్మడిదల మండల పరిధిలోని అనంతరం, కానుకుంట, నూతనకల్, కొత్తపల్లి, తదితర గ్రామాల పరిధిలో అంతర్గత రహదారుల నిర్మాణానికి హ్యామ్ ద్వారా నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు డిఈ దీపక్ తెలిపారు. టెండర్లు పూర్తి చేసిన పనులు ప్రారంభించక పోతే.. సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, పిఆర్ డిఈ దీపక్, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, ఏఈ శశిధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఏమైనా రెడ్ల అయ్య జాగీరా

## - చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే - తీన్మార్ మల్లన్న



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సమాజంలో మెజారిటీగా ఉన్న బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అన్ని ప్రాజెక్టులకు రెడ్ల పేర్లు పెట్టడాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్రంగా వ్యతిరేకించారు. తెలంగాణలో ఏ ప్రాజెక్టు చూసినా, ఏ ఫ్లైఓవర్ చూసినా రెడ్ల పేర్లే కనిపిస్తున్నాయని, రాష్ట్రం ఏమైనా రెడ్ల అయ్యా జాగీరా అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా మండిపడ్డారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ ఓ వీడియోలో మాట్లాడుతూ సనత్ నగర్ లో నిర్మిస్తున్న తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) కు మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు, ఫ్లై ఓవర్లకు మరియు ఎత్తిపోతల పథకాలకు కూడా కేవలం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకుల పేర్లే ఎందుకు పెడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎలిమినేటి మాధవరెడ్డి, సూదిని జయపాల్ రెడ్డి, రామిరెడ్డి దామోదర్ రెడ్డి వంటి పేర్లతో రాష్ట్రంలో ఇప్పటికే అనేక విగ్రహాలు, ప్రాజెక్టులు ఉన్నాయని, కావాలంటే సులభ్ కాంప్లెక్స్ లకు కూడా రెడ్ల పేర్లే పెట్టుకోండి అంటూ ఎద్దేవా చేశారు. టిమ్స్ నిర్మాణానికి సంబంధించిన ఆర్థిక లెక్కలను బయటపెడుతూ తీన్మార్ మల్లన్న సంచలన ఆరోపణలు చేశారు. సనత్ నగర్ టిమ్స్ నిర్మాణానికి దాదాపు 1111 కోట్ల రూపాయల అప్పు తెచ్చారని, ఈ అప్పులో రూ.601 కోట్లు బీసీల పేరు మీద తెచ్చినవేనని పేర్కొన్నారు. కేవలం 40 కోట్ల రూపాయల అప్పు మాత్రమే ఓసీల (రెడ్ల) పేరు మీద ఉందని, కానీ పేరు మాత్రం రెడ్డి సామాజిక వర్గానిదే అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొమ్మేమో మాది (బీసీలది), పేరు మాత్రం మీదా (రెడ్లదా)? అని సీఎం రేవంత్ రెడ్డిని తీన్మార్ మల్లన్న ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు కూడా రెడ్లే ఉంటున్నారని, ఇది తెలంగాణలో మెజారిటీగా ఉన్న బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను గుర్తు చేస్తూ, మర్రి చెన్నారెడ్డి, కొండా వెంకట రంగారెడ్డి వంటి వారు తెలంగాణ ద్రోహులని మల్లన్న పేర్కొన్నారు. కొండా వెంకట రంగారెడ్డి పేద రైతుల నోట్లో మట్టి కొట్టి భూములను దొరలకు అప్పగించిన దొంగ అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న లేదా దొడ్డి కొమరయ్య పేరు పెడతామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ మాటలను తుంగలో తొక్కిందని విమర్శించారు. టిమ్స్ కు తెలంగాణ వీరులైన పండుగ సాయన్న లేదా సర్దార్ సర్వాయి పాపన్న పేర్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

**- తెలంగాణకు ఆఖరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..**

తెలంగాణకు చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవుతారని మల్లన్న జోస్యం చెప్పారు. 2028 తర్వాత తెలంగాణలో బీసీల ప్రభుత్వమే వస్తుందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇప్పుడు పెట్టిన రెడ్ల పేర్లన్నింటినీ తొలగిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేబీఆర్ పార్క్ ముందున్న కాసు బ్రహ్మానంద రెడ్డి విగ్రహాన్ని జేసీబీతో పీకేసి అవతల పారేస్తామని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి తన పద్ధతి మార్చుకోవాలని, లేదంటే ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షను సహించేది లేదని, బీసీ మహనీయుల పేర్లు పెట్టే వరకు తమ పోరాటం ఆపబోమని తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు.

## ప్రముఖుల దర్శన విధానంలో మార్పులు: ఈఓ శ్రీనివాస్



శ్రీశైలం (ప్రశ్న న్యూస్)సామాన్య భక్తుల సౌకర్యార్థం ప్రొటోకాల్ దర్శనం విధానంలో మార్పులు చేసినట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస రావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శని, ఆది, సోమవారాల్లో రాత్రివేళల్లో నిర్దిష్ట సమయంలో మాత్రమే స్పర్శదర్శనం కల్పిస్తున్నామన్నారు. ఈ మూడు రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో స్పర్శదర్శనానికి అవకాశం ఉండబోదన్నారు. మంగళ, బుధ, గురు, శుక్రవారాల్లో యథావిధిగా మూడుసార్లు నిర్దిష్ట వేళల్లో స్పర్శదర్శనం కల్పిస్తామన్నారు. శ్రావణమాసంలో శుక్రవారం రోజు కూడా ఉదయం, మధ్యాహ్నం వేళల్లో స్పర్శదర్శనం ఉండదని తెలిపారు. అలాగే ఆలయ సందర్శనకు వచ్చే ప్రముఖులు కనీసం రెండు రోజులు ముందుగా వారి పర్యటన వివరాలు, వసతి, దర్శనం కోసం పంపే సిఫార్సు లేఖలను కూడా అధికారిక లెటర్హెడ్పై దేవస్థానానికి సమాచారం అందజేయాలని తెలిపారు. ఈ లేఖలను జూతీశీశీ-ఎశీశ్రీఏంతీఅయిఅశ్రీఖనవఋర్ష్ఖుఋఎ.శీతీస్త్ర 2 పంపాల్సి ఉంటుందన్నారు. అలాగే ఈ లేఖలను ప్రొటోకాల్ ఫోన్నెం. 9160016215 కు వాట్సాప్ ద్వారా కూడా పంపవచ్చునన్నారు.

## స్నేహితుల దినోత్సవాన గొప్ప మనసు.. మిత్రుడికి రూ.30 వేల చేయూత

**2010-11 కీసర జిల్లా పరిషత్ హై స్కూల్ పూర్వ విద్యార్థుల ఆదర్శం - ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహచరుడికి అండ**



కీసర (ప్రశ్న న్యూస్) స్నేహితుల దినోత్సవం సందర్భంగా కీసరలో హృదయాలను హత్తుకునే ఘటన చోటుచేసుకుంది. 2010--11 విద్యా సంవత్సరంలో కీసర జెడ్పీహెచ్ఎస్ లో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ సహచరుడు సీహెచ్. మధు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకుని స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.చిన్ననాటి స్నేహాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చాటుతూ, కష్టకాలంలో మిత్రుడికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, "స్నేహితుల దినోత్సవం అంటే శుభాకాంక్షలు చెప్పుకోవడం మాత్రమే కాదు.. అవసరంలో ఉన్న స్నేహితుడికి చేయూతనివ్వడమే నిజమైన స్నేహం. మధుకు ఎలాంటి అవసరం వచ్చినా మా బ్యాచ్ ఎప్పుడూ అండగా ఉంటుంది" అని తెలిపారు. ఈ ఘటన స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. సోషల్ మీడియాలో సందేశాలు పంచుకోవడం కంటే, అవసరంలో ఉన్న స్నేహితుడికి తోడుగా నిలవడం గొప్పదని 2010--11 కీసర జెడ్ పి హెచ్ ఎస్ పూర్వ విద్యార్థులు తమ చర్యతో చాటిచెప్పారు. "స్నేహం అంటే కష్టసుఖాల్లో తోడుగా నిలవడం" అనే సందేశాన్ని ఈ ఘటన సమాజానికి అందించింది.

## రాంపల్లి ఎక్స్ రోడ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సూపర్వైజర్ దుర్మరణం



కీసర( ప్రశ్న న్యూస్ ) రాంపల్లి ఎక్స్ రోడ్‌లోని మహీంద్ర షోరూమ్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిర్యాల గ్రామానికి చెందిన మంద నర్సింహులు (35) మృతి చెందారు. విధులకు వెళ్తుండగా లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ఆయన డివైడర్‌పై పడిపోయి తలకు తీవ్ర గాయాలై ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పారిశుధ్య కార్మికుల పీఫ్ / ఈ ఎస్ ఐ బకాయిలు వెంటనే జమ చేయాలి: తుడుం శ్రీనివాస్

**- ప్రజావాణిలో ఎం ఎం సి కమిషనర్‌కు వినతి**

**- వారానికి ఒక రోజు సెలవు అమలు చేయాలని డిమాండ్**



కీసర( ప్రశ్న న్యూస్) కీసర డివిజన్-1 పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాల నుంచి గత రెండు సంవత్సరాలుగా పీఫ్ , ఈ ఎస్ ఐ నిధులు మినహాయింపులు చేస్తున్నప్పటికీ, ఆ మొత్తాలు కార్మికుల ఖాతాల్లో జమ కాలేదని ఆరోపిస్తూ వాటిపై తక్షణ విచారణ చేపట్టి, బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ ప్రజావాణిలో ఎంఎంసి కమిషనర్‌ను కోరారు.గ్రామపంచాయతీలను దమ్మాయిగూడ పురపాలక సంఘంలో విలీనం చేసిన అనంతరం ఈ సమస్య కొనసాగుతోందని ఆయన తెలిపారు. అలాగే పారిశుధ్య కార్మికులకు పీఫ్ , ఈఎస్ఐ, క్లెయిమ్ విధానం, ఆసుపత్రి సేవలు, అవసరమైన పత్రాలు, సంక్షేమ ప్రయోజనాలపై సరైన అవగాహన కల్పించేందుకు సంబంధిత అధికారులు, ఆరోగ్య శాఖ లేదా ఈఎస్ఐ ప్రతినిధులతో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా, తెలంగాణ కోడ్ ఆన్ వేజెస్ రూల్స్--2021 ప్రకారం ప్రతి ఉద్యోగికి వారానికి ఒక రోజు విశ్రాంతి ఇవ్వాల్సిన నిబంధన ఉందని పేర్కొంటూ, పారిశుధ్య కార్మికులకు కూడా వారానికి కనీసం ఒక రోజు సెలవును తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. దీంతో పని ఒత్తిడి తగ్గి, కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవితం మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఇస్లామిస్టులతో కలిశాక
# లెఫ్టిస్టులు అవుతున్నారు
## – కంగనా రనౌత్



న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఇవాళ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. దాంట్లో ఆమె తన ఫీలింగ్ వ్యక్తం చేశారు. తానొక జాగృతి చెందిన హిందువు మహిళను అని ఆమె పేర్కొన్నారు. అయితే ఇస్లామిస్టులతో కలిసిన తర్వాత హిందూ మహిళలు కరుడుకట్టిన వామపక్షవాదుల తరహా మారుతున్నట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యస్త హిందువు మహిళగా ఉన్న తాను జాగృతి చెందిన హిందువుగా మారినట్లు పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం కాక్రోచ్ జనతా పార్టీపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారామె. సీజేపీ ఓ మురికికాలువ అంటూ ఆమె తన ఎక్స్‌లో వివాదాస్పద పోస్టు చేశారు. తాజా వీడియో మెసేజ్‌లో కంగనా రనౌత్ మాట్లాడుతూ.. ఒక ఫీలింగ్ షేర్ చేసుకోవాలని ఉందన్నారు. పార్లమెంట్‌కు వెళ్లడం ఆలస్యం అవుతున్నా, తన ఫీలింగ్‌ను పంచుకోవడం ముఖ్యమన్నారు. ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళల గురించి ఆమె తన వీడియోలో ప్రస్తావించారు. అనేక మంది హిందువు మహిళలతో తనకు పరిచంయ ఉందని, కానీ ఎవరికీ రాజకీయంగా కానీ, మతపరంగా కానీ చాలా వరకు మహిళల్లో అవగాహన ఉండేదికాదన్నారు. సాధారణంగా యువతలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తుంటాయని, వాళ్లు తటస్థంటా ఉంటారన్నారు. కానీ ఇస్లామిస్టులతో పరిచయం ఏర్పడిన తర్వాత.. ఆ మహిళల్లో మార్పులు వస్తుంటాయని కంగనా అన్నారు. ఇస్లామిస్టులతో కలిసిన తర్వాత లెఫ్టిస్టులు అవుతారని, దీంట్లో ఎటువంటి నష్టం లేదని, ఎందుకంటే రాజ్యాంగం వాళ్లకు ఆ స్వేచ్ఛ ఇచ్చిందని, మనకు కావాల్సిన ఏదైనా మతాన్ని కానీ, ఐడియాలజీని కానీ స్వీకరించవచ్చు అన్నారు. అయితే తాను ఇప్పుడు మధ్యస్థ హిందువును కాదు అన్నారు. అయితే ఇప్పుడు తనను వేధిస్తున్నారని, సంఘ్‌పరివార్‌లో ఎప్పుడు చేరానని అడుతున్నారని, ఇప్పుడు నేనొక జాగృతి పొందిన హిందువును అని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ తరహా లాంటి హిందువును అని, మార్పిడి జరగాలని కోరుతున్నానని, తానెందుకు మార్పిడి కావొద్దన్నారు. హిందువు మహిళలు ఓ నిర్దిష్ట ఐడియాలజీ ఐడెంటిటీ కోసం పోరాటం చేయాలన్నారు. మార్పిడితో చైతన్యం పొందాలని, మరి ఆ దారిని ఎందుకు మూసివేస్తున్నారని ఆమె అడిగారు.

## 'కాసుల కళ వేరే అంట..
# అవి పూసుకు తిరగాలంటా'..
### ఆలోచింపజేసేలా అమీర్ లోగ్ సాంగ్



రమణారెడ్డి సోమ డైరెక్ట్ చేస్తున్న యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్ అమీర్ లోగ్ (సాఎవవతీ రాశీస్త్ర). ఎంసీ హరి, మనోజ్, శశిధర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో వేదా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయి యోగి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆగస్టు 21న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ నుంచి విడుదల చేస్తున్న ఒక్కో పాట సెపరేట్ స్టైల్‌లో సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. తాజాగా మేకర్స్ కాసుల కళ అంటూ సాగే లిరికల్ వీడియో సాంగ్‌ను లాంచ్ చేశారు. రెక్కలు కదలాడందే చిక్కులు విడిపోవంట లెక్కలు సరితూగే వేళ.. పిక్కలు పరుగాడందే డొక్కలు నిదరోవంట.. కాసుల కళ వేరే అంటా.. అవి పూసుకు తిరగాలంటా అనే లిరిక్స్‌తో హైదరాబాద్‌లో కాసులు సంపాదనలో పడే కష్టాలు ఎలా ఉంటాయో కండ్లకు కట్టినట్టు చూపించనున్నట్టు విజువల్స్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ సాంగ్‌కు హైదరాబాదీలంతా కనెక్ట్ అవడం గ్యారంటీ అని లిరిక్స్ చెప్పకనే చెబుతున్నాయి. కాసుల కళ.. ఒకపాట కాదు.. మన జీవితంలో చాలా మందికి కనెక్ట్ అయ్యే ఒక ఎమోషన్ అంటూ రిలీజ్ చేసిన ఈ పాటపై మీరూ ఓ లుక్కేయండి. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదల చేసిన అవ్వల్ దావత్ సాంగ్‌తోపాటు హైదరాబాదీ ర్యాప్ స్టైల్‌లో సాగే 'సీదా హెలికాప్టర్ షాట్' సాంగ్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. అమీర్ లోగ్ తెలుగు రాష్ట్రాల పంపిణీ హక్కులను టాలీవుడ్ యాక్టర్ రానాకు చెందిన స్పిరిట్ మీడియా సొంతం చేసుకుంది. హైదరాబాద్ గల్లీ బ్యాక్‌డ్రాప్‌లో ముగ్గురు స్నేహితుల మధ్య కథ నేపథ్యంలో కామెడీతోపాటు కంటెంట్‌ను నమ్మి వస్తున్న మూవీని అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నాడు.

## 'ఇరుముడి' నుంచి 'యాలాలో యాలాలో'..
## ఫ్యామిలీ మెలోడీతో ఎమోషన్స్‌కు శ్రీకారం!




మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ ఎమోషనల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రమోషన్లను మేకర్స్ వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో చిత్రం నుంచి రెండో సింగిల్ 'యాలాలో యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..' అనే మధురమైన ఫ్యామిలీ మెలోడీని విడుదల చేశారు. కుటుంబ బంధాలు, ఆప్యాయత, భావోద్వేగాలను ప్రతిబింబించేలా రూపొందిన ఈ పాట తొలి వినికిడిలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని హత్తుకునే సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మెలోడీ స్వరాలతో పాటను మరింత అందంగా తీర్చిదిద్దారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా కనిపించడం సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' భక్తి గీతంగా మంచి ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో యాలాలో'తో సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. 'ఇరుముడి'లో రవితేజ ఇప్పటివరకు చేయని ఓ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం చెబుతోంది. తండ్రీ--కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానాంశంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు కూడా కీలక ప్రాధాన్యం ఉంది. తన కూతురి కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి ప్రయాణాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నట్లు తెలుస్తోంది.

సోషల్ మీడియాలో సినిమా విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు కూడా మేకర్స్ తెరదించారు. ముందుగా ప్రకటించినట్లుగానే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా స్పష్టం చేశారు. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, మాస్ యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.

## ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని
# దర్శించుకున్న వైష్ణవి చైతన్య..
### బోనం సమర్పించి ప్రత్యేక పూజలు



తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు హైదరాబాద్ నగరంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని ప్రముఖ టాలీవుడ్ నటి వైష్ణవి చైతన్య సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి విచ్చేసిన ఆమె, శిరస్సుపై బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించడం అక్కడికి వచ్చిన భక్తులను ఆకట్టుకుంది. ఆలయానికి చేరుకున్న వైష్ణవి చైతన్యకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్న వైష్ణవి కొంతసేపు ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వైష్ణవి చైతన్య.. ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని, మానసిక ప్రశాంతతను ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అలాగే తన కుటుంబ సభ్యులకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. వైష్ణవి చైతన్య బోనాల వేడుకల్లో పాల్గొన్న ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సంప్రదాయ చీరలో, అచ్చ తెలుగు అమ్మాయిలా కనిపించిన ఆమె లుక్‌కు అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. సినీ రంగంలో బిజీగా ఉన్నప్పటికీ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం అభినందనీయమని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'బేబీ' సినిమాతో యువతలో విశేషమైన గుర్తింపు తెచ్చుకున్న వైష్ణవి చైతన్య ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. షూటింగ్‌ల మధ్య సమయం కేటాయించి ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడం ఆమె భక్తిని, సంప్రదాయాల పట్ల ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తోందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తెలంగాణలో ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే బోనాల మహోత్సవాలకు సినీ, రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా పలువురు ప్రముఖులతో పాటు వైష్ణవి చైతన్య పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## ఓటీటీలోనూ 'దీవానా' దూకుడు..
### 50 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాల మైలురాయి చేరుకుందిగా!




థియేటర్లలో మంచి ఆదరణ పొందిన చిత్రం దీవానా. యువ నటులు హర్షిత్ రెడ్డి, స్నేహా మణిమేగలై ప్రధాన పాత్రల్లో రూపొందిన 'దీవానా' చిత్రం ఇప్పుడు ఓటీటీలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక ఆహాలో ఇటీవల స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణను సొంతం చేసుకుంటూ అరుదైన రికార్డును నమోదు చేసింది. ఆహాలో విడుదలైనప్పటి నుంచి 'దీవానా' ఏకంగా 50 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలు పూర్తి చేసి మరో మైలురాయిని అందుకుంది. థియేటర్లలో పాజిటివ్ టాక్‌తో ఆకట్టుకున్న ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకుల మన్ననలు కూడా పొందుతుండటం విశేషం. మంచి కథ, భావోద్వేగాలు, వినోదం కలగలిసిన ఈ చిత్రం కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని ఓటీటీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, స్నేహా మణిమేగలై జంటగా నటించగా, ప్రముఖ నటులు నరేష్ విజయ్ కృష్ణ, ఝాన్సీ, బలగం వేణు, జీవన్ కుమార్, టోనీ కీలక పాత్రల్లో కనిపించి కథకు బలాన్నిచ్చారు. వీరి నటన కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'దీవానా' చిత్రాన్ని వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మించారు. గీతా ఆర్ట్స్, వి స్టూడియోస్, అర్హా మీడియా బ్యానర్లపై రూపొందిన ఈ సినిమాకు ఈశ్వర్ చంద్ర సంగీతాన్ని అందించారు. ఆయన స్వరపరిచిన పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మరింత బలాన్ని చేకూర్చాయి. థియేటర్ల తర్వాత ఓటీటీలో కూడా ఇలాంటి అద్భుతమైన స్పందన రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది

## 'ది ప్యారడైజ్'తో నాని కొత్త రికార్డు..
## ప్రీ రిలీజ్ బిజినెస్‌లో కెరీర్ బెస్ట్!



నేచురల్ స్టార్ నాని మార్కెట్ రోజురోజుకూ విస్తరిస్తుండగా, ఆయన నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. థియేట్రికల్ హక్కుల వ్యాపారంలో ఈ సినిమా నాని కెరీర్‌లోనే అత్యధిక ప్రీ రిలీజ్ బిజినెస్ నమోదు చేసిన చిత్రంగా నిలిచే దిశగా దూసుకెళ్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, తెలుగు రాష్ట్రాల్లోనే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్ రూ.82 కోట్ల నుంచి రూ.84 కోట్ల వరకు చేరినట్లు తెలుస్తోంది. దీంతో నాని మార్కెట్ స్థాయి మరో మెట్టుకు చేరిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినిమా నైజాం థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సుమారు రూ.37 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఒప్పందంలో రికవరీ క్లాజ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ డీల్‌లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ, నిర్మాత సుధాకర్ చెరుకూరి భాగస్వాములుగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. నైజాం ప్రాంతంలోనే ఈ స్థాయి బిజినెస్ జరగడం నాని కెరీర్‌లో అరుదైన మైలురాయిగా భావిస్తున్నారు. కోస్తాంధ్ర హక్కుల కోసం కూడా డిస్ట్రిబ్యూటర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లు సమాచారం. అక్కడ కూడా సుమారు రూ.35 కోట్ల స్థాయిలో బిజినెస్ పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటు రాయలసీమ (సీడెడ్) హక్కుల విషయంలో నిర్మాతలు రూ.12 కోట్ల నాన్-రిఫండబుల్ అడ్వాన్స్ కోరుతున్నట్లు తెలుస్తోంది. పలువురు డిస్ట్రిబ్యూటర్లు ఆసక్తి చూపుతున్నప్పటికీ, తుది ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో నాని నటించిన 'హిట్ 3' సినిమా సుమారు రూ.40 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్‌తో ఆయన కెరీర్‌లో అత్యధిక రికార్డు సృష్టించింది. ఇప్పుడు 'ది ప్యారడైజ్' ఆ సంఖ్యను దాదాపు రెట్టింపు చేస్తూ కొత్త బెంచ్‌మార్క్‌ను నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది. 'దసరా', 'సరిపోదా శనివారం' వంటి వరుస విజయాలతో నాని పాన్ ఇండియా మార్కెట్ మరింత బలపడిందని ఈ బిజినెస్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

## 'అగధ' ట్రైలర్ విడుదల.. మంత్ర తంత్రాల రహస్యాలతో
# ఉత్కంఠ రేపుతున్న ఎంఎస్ రాజు!

ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ సాఖా బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు.

"మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది... దాని గురించి నాకు తెలియాలి" అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది.




ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'అగధ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాల్సి ఉంది.

## మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ చేయూత.

**బియ్యం, నగదు అందజేత**

**సీతక్క ఆదేశాలతో ఆర్థిక సహాయం.**



కన్నాయిగూడెం ( ప్రశ్న న్యూస్) అనారోగ్యంతో మరణించిన ముప్పనపల్లి గ్రామానికి చెందిన కటకం అంజయ్య కుటుంబానికి కాంగ్రెస్ నేతలు ఆర్థిక సహాయం అందించారు. అంజయ్య జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు కటకం మల్లయ్య సోదరుడు. మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షులు పైడకుల అశోక్ ఆదేశాలతో ఆదివారం పెద్ద కర్మ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ?10,000 నగదు అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు జాడి రాంబాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని, ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిప్పనపల్లి లక్ష్మయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు దాసరి నర్సింగరావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ వద్ద మరుగుదొడ్డి ఏది? ప్రజల అవస్థలు

**నిరుపయోగ మరుగుదొడ్డి, గిరిజనుల గోస.**

**తక్షణం తెరవాలి: తుడుందెబ్బ ఫైర్.**



ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్)ఐటీడీఏ కార్యాలయం వద్ద నిర్మించిన సామూహిక మరుగుదొడ్డి నెలల నుంచి మూతపడి ఉండటంతో వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆదివారం ఐటీడీఏ పీఓకు వినతిపత్రం ఇచ్చిన తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిసె బాలకృష్ణ మాట్లాడుతూ, రోజూ వందలాది మంది వివిధ కార్యాలయాలకు వస్తున్నా మరుగుదొడ్డి లేక మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేసి నీరు, కరెంటు, పరిశుభ్రతతో మరుగుదొడ్డిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవ సంబరాలు



ఏటూరు నాగారం(ప్రశ్న న్యూస్) మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలోని ఆకుల వారి ఘనపురం అంగన్వాడి సెంటర్ 2 లో తల్లిపాల వారోత్సవాల నిర్వహించారు ఈ సందర్భంగా ఏటూరునాగారం సి డి పి ఓ సీతారాములు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు తప్పకుండా పట్టించాలని తల్లిపాలు బిడ్డలకు రక్షణగా ఉంటాయని తల్లిపాల వలన బిడ్డకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా చూస్తుందని, అన్నారు ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు పట్టించాలని, తర్వాత బిడ్డకు ఇచ్చే అదనపు ఆహారం తో పాటు రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు కూడా పట్టించాలని తల్లులను కోరారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అనూష వసంత మరియు అంగన్వాడీ టీచర్స్ వసంత సుధా భవాని తల్లులు మరియు తల్లులు పిల్లలు పాల్గొన్నారు

## గిరిజన దర్బార్



ఏటూరునాగారం(ప్రజాన్యూస్) ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాలతో సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ జరిగింది. డిప్యూటి డైరెక్టర్ కు గిరిజనులు 10 వినతులు అందజేశారు. ఆగస్టు 9 ఆదివాసి దినోత్సవానికి నిధులు, ఆర్వోఎఫ్ఆర్ పట్టా పాసు పుస్తకాల మంజూరు, పోడు భూముల రక్షణ, అక్రమ పట్టాలపై ఎల్టీఆర్ కేసులు, గంగారం గ్రామంలో అక్రమ గద్దెల తొలగింపు, జగ్గన్నపేట పాఠశాలలో రెజ్లింగ్ కోచ్ నియామకం వంటి అంశాలు ఉన్నాయి. కార్యక్రమంలో డీఎంహెచ్వో క్రాంతికుమార్, జేడీఎం కొండలరావు, సురేష్, కిషోర్, వాణి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అన్ని వినతులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## శ్రీకాళహస్తిలో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐఏఎస్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐఏఎస్ కుటుంబ సభ్యులతో కలిసి ఈరోజు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించి, శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక ఆశీర్వాదాలు తీర్థ ప్రసాదాలు స్వామి అమ్మవారి చిత్రపటం పొందారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ప్రోటోకాల్ ఏఈఓ పి లోకేష్ బాబు , తాసిల్దార్ సుబ్రహ్మణ్యం, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ , ఆలయ ఇన్స్పెక్టర్ ఎం హరియాదవ్ దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశుసంపద పథకంలో పెద్దల పెత్తనం.

**మహిళా సంఘాల లబ్ధిదారుల ఎంపికపై తీవ్ర ఆరోపణలు**

**జాబితా బహిర్గతం చేయాలని డిమాండ్.**






కన్నాయిగూడెం(ప్రశ్న న్యూస్) మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధిని లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పశుసంపద పథకం కన్నాయిగూడెం మండలంలో వివాదాస్పదంగా మారింది. అర్హత ఉన్న సంఘాలను పక్కనపెట్టి కొందరి ప్రభావంతోనే లబ్ధి చేకూరుతుందనే ఆరోపణలతో మండలంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. పథకం కింద పశువుల యూనిట్ల కేటాయింపు నుంచి లబ్ధిదారుల ఎంపిక, పశువుల కొనుగోలు, బిల్లుల చెల్లింపు వరకు ప్రతి దశలోనూ పారదర్శకత లోపించిందని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొందరికే అవకాశం కల్పించారని, నిజమైన లబ్ధిదారులు అనర్హులుగా మిగిలిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**లబ్ధిదారుల ఎంపికలో అసమానతలు.**

స్థానికంగా అర్హత కలిగిన పలు మహిళా సంఘాలు దరఖాస్తులు చేసినప్పటికీ, వాటికి అవకాశం దక్కలేదని సమాచారం. బదులుగా రాజకీయ, ఆర్థిక ప్రభావం ఉన్న వ్యక్తుల సిఫార్సుతో కొన్ని సంఘాలకే యూనిట్లు మంజూరయ్యాయనే ప్రచారం జరుగుతోంది. కొనుగోలు చేసిన పశువుల ధరల విషయంలోనూ అవకతవకలు జరిగాయని, బిల్లుల చెల్లింపులో జాప్యం ఉందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

**బహిర్గతం చేయాలని డిమాండ్..**

ఈ నేపథ్యంలో మహిళా సంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు. అసలు మండలంలో ఎన్ని సంఘాలకు పశుసంపద యూనిట్లు మంజూరయ్యాయి, లబ్ధిదారుల పూర్తి జాబితా ఏమిటి, ఎంత మొత్తంలో నిధులు ఖర్చు చేశారు అనే వివరాలను బహిరంగపరచాలని డిమాండ్ చేస్తున్నారు. పథకం అమలులో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు. విచారణలో అవకతవకలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకం ఉద్దేశం నీరుగారిపోకుండా, అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

## మూడు చింతలపల్లి మున్సిపల్ కార్మికులకు 2 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ శ్రీనివాస్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లామూడు చింతలపల్లి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులతో పాటు ఇతర మున్సిపల్ కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం పట్ల తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ), మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజారోగ్యం, పారిశుధ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికులు ప్రతిరోజూ నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వారికి సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం కార్మిక చట్టాలకు, మానవీయ విలువలకు విరుద్ధమని అన్నారు. రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఇళ్ల అద్దెలు, నిత్యావసర వస్తువుల కొనుగోలు, పిల్లల విద్యా ఖర్చులు, వైద్య అవసరాలు తీర్చలేని దుస్థితి నెలకొనడంతో పాటు, అధిక వడ్డీకి అప్పులు చేసి జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల మూడు చింతలపల్లి మున్సిపల్ కమిషనర్తో పాటు సంబంధిత ఆర్థిక అధికార యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకుని పెండింగ్లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై ప్రతి నెల 1వ తేదీ నుంచి 5వ తేదీలోపు కార్మికుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమయ్యేలా శాశ్వత వ్యవస్థను అమలు చేయాలని కోరారు.

## రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం పనులను ప్రారంభించిన

**ఎల్లంపేట చైర్ పర్సన్ శ్రీదేవి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని రాజ బొల్లారం తండా ఘనపూర్ లో రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాజ బొల్లారం తండాలో రూ. 10 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చైర్ పర్సన్ శ్రీదేవి ప్రారంభించారు. ఇదేవిధంగా ఘనాపూర్ లో 10 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు సిసి రోడ్డు పనులను చైర్ పర్సన్ శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధుల నుండి ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. దీంతో రాజా బొల్లారం తండాలో డ్రైనేజ్ సమస్య పరిష్కారం కానుందని ఇదేవిధంగా ఘనపూర్ లో డ్రైనేజ్ సమస్యతో పాటు రోడ్డు సమస్య సైతం పరిష్కారం కానుందని పేర్కొన్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీకి పాలకవర్గం వచ్చాక గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని... ఇందుకు ఎంతో సంతోషంగా చైర్ పర్సన్ శ్రీదేవి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి వైస్ చైర్మన్, బిజెపి కౌన్సిలర్ మేకల రజిత దేవేందర్ రెడ్డి బీఆర్ఎస్ కౌన్సిలర్ నిషితా రెడ్డి ఎల్లంపేట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విగ్నేశ్వర్ రెడ్డి బిఆర్ఎస్ కౌన్సిలర్ సురేష్ రెడ్డి కౌన్సిలర్లు మాలోత్ శాంతిరాజు, కౌన్సిలర్ పార్వతీ తారియా కౌన్సిలర్ వేణుగోపాల్, కౌన్సిలర్ నినావత్ పార్వతి ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, రాజ బొల్లారం వార్డ్ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అరుణ గోదాం సీజ్

**ఎల్లంపేట కమిషనర్ పై ప్రశంస జల్లులు**

**ఎలాంటి అనుమతులు లేకుండా అరుణ గోదాం నిర్మాణం**

**అరుణ గోదాం పై మున్సిపల్ అధికారుల కొరడ**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఎల్లంపేటలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన అరుణ గోదాం పై మున్సిపల్ అధికారులు కొరడా విధించారు. పోలీసుల సహకారంతో అరుణ గోదాంలో సీజ్ చేశారు. దీంతో కొంతకాలంగా అరుణ గోదాం విషయంలో జరిగిన చర్చలకు ఫుల్ స్టాప్ పడినట్లు అయింది. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అంటూ సాగుతున్న చర్చలకు ఎట్టకేలకు ఇటీవల కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ కే కృష్ణారెడ్డి కొరడా విధించారు. అరుణ గోదాం పై పలు పత్రికలలో కథనాలు వచ్చిన మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పై మున్సిపల్ అధికారులపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అరుణ గోదాం నిర్వాహకుల కు ఎల్లంపేట మున్సిపల్ అధికారుల మధ్య ఒప్పందం కుదరడంతోనే ఎల్లంపేట మున్సిపల్ అధికారులు అరుణ గోదాం పై చర్యలు తీసుకోలేదని విమర్శలు వెల్లువెత్తాయి.

**చక్రం తిప్పిన కాంగ్రెస్ నేత**

అనుమతులు లేకుండా నిర్మించిన అరుణ గోదాం పై ఈగ వాలకుండా అధికార పార్టీ కి చెందిన ఓ నేత చక్రం తిప్పారని ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ గోదాం విషయంలో అధికారులు ఎవరు వెళ్లిన ఈ గోదాం వెనుక అధికార పార్టీకి చెందిన నేత ఉన్నారు అంటూ భయపెడుతూ గోదాం జోలికి రాకుండా ఇంతకాలం అడ్డుకున్నారు. దాదాపు నిర్మాణం పూర్తి కావస్తున్న సమయంలో అరుణ గోదాం ను సీజ్ చేయడం పై హర్షం వ్యక్తం అవుతుంది.

**శభాష్ ఎల్లంపేట కమిషనర్...**

కొత్తగా ఏర్పడిన ఎల్లంపేట మున్సిపల్ ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున నిర్మిస్తున్న అరుణ గోదాం ను సీజ్ చేసిన ఎల్లంపేట కమిషనర్ కృష్ణారెడ్డి పై ప్రశంస జల్లులు కురుస్తున్నాయి. కొత్తగా ఏర్పడిన ఎల్లంపేట మున్సిపాలిటీకి ప్రస్తుతం కమిషనర్ కృష్ణారెడ్డి మూడో కమీషనర్. అంతకు ముందు ఇద్దరు కమిషనర్లు ఇక్కడ పని చేసి వెళ్లారు. మొదట నిత్యానంద్, అనంతరం స్వామి నాయక్ మూడో కమీషనర్ గా కృష్ణారెడ్డి బాధ్యతలను చేపట్టారు. ఆ ఇద్దరు కమిషనర్లు చేయలేని పనిని ప్రస్తుత కమిషనర్ కృష్ణారెడ్డి అరుణ గోదామును సీజ్ చేసి తన సత్తాను చాటుకున్నారు. అరుణ గోదాం యజమానులు పాత కమిషనర్లు ఇద్దరిని మేనేజ్ చేసుకున్నట్లు సమాచారం. దానివల్లే అరుణ గోదాం అక్రమం అని తెలిసిన సదరు కమిషనర్లు దాని జోలికి వెళ్లలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అరుణ గోదాం నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేశారు. ఈ సమయంలో కొత్తగా వచ్చిన కమీషనర్ కృష్ణారెడ్డి సీజ్ చేయడంతో ఉత్కంఠ నెలకొంది. ఎల్లంపేట ప్రజలు కమిషనర్ కృష్ణారెడ్డి పై ప్రశంస జల్లులు కురిపిస్తున్నారు.

## శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి పరిశీలించారు. ప్రధాన తనిఖీలు చేశారు. పరిశుభ్రత టాయిలెట్ల పరిశీలన ఆసుపత్రిలోని వార్డులు,మరియు ముఖ్యంగా టాయిలెట్ల పరిశుభ్రతను ఆమె స్వయంగా పరిశీలించారు. రోగులకు, వారి బంధువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రి ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. రైస్ ఆహార నాణ్యత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్ పేషెంట్లకు అందిస్తున్న ఆహారం భోజనం నాణ్యతను బృందమ్మ తనిఖీ చేశారు. రోగులకు అందించే ఆహారం శుచిగా,రుచిగా మరియు పౌష్టికాహారంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి క్యాంటీన్ భోజన నిర్వాహకులకు సూచించారు. రోగుల పరామర్శ వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో ముఖాముఖిగా మాట్లాడారు వారికి అందుతున్న వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ మరియు డాక్టర్ల అందుబాటు గురించి అడిగి తెలుసుకున్నారు. పేషెంట్లు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం తరపున మెరుగైన వైద్యం అందుతుందని భరోసా ఇచ్చారు. వైద్యులు సిబ్బందికి సూచనలు పేద ప్రజలకు మెరుగైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని, ఆసుపత్రి సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ రోగుల పట్ల సమయస్ఫూర్తితో, పద్ధతిగా వ్యవహరించాలని అధికారులను కోరారు. ఆసుపత్రిలో పారిశుధ్య లోపాలు లేకుండా చూడటం,రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడం మరియు మెరుగైన ఉచిత వైద్యం అందేలా చూడటమే లక్ష్యంగా ఈ తనిఖీ జరిగింది.

# తల్లి మరణ వార్త తెలిసిన ముఖం చాటేసిన కొడుకు

**- కూతురే కొడుకై చితికి నిప్పు**

**- సిరిసిల్లలో కంటతడి పెట్టిస్తున్న విషాదం**

సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) ఆర్థిక సంబంధాలే ముఖ్యమై, మానవ సంబంధాలను శిథిలం చేస్తున్న చోట మానవీయత కరువైంది. మనసు కదిలించి కంటతడి పెట్టించే విషాద ఘటన సిరిసిల్లలో చోటు చేసుకుంది. మనసున్న ప్రతి వారిని కలచివేస్తుంది. చివరి చూపుక్కూడా రాని కొడుకు, చివరికి కొడుకైన కూతురు తల్లికి చితికి నిప్పు పెట్టి అంత్యక్రియలు జరిపిన ఘటన పలువురిని కలచివేసింది. వివరాల్లోకి వెళితే సిరిసిల్ల పట్టణం గోపాల్ నగర్ కు చెందిన దాసరి కాశవ్వ అనే 73 ఏళ్ల వృద్ధురాలు. గత మూడు నెలలుగా ఆకలితో అలమటించి దయనీయ స్థితిలో కన్ను మూసింది.అందరూ ఉన్నా అనాథ శవంగా మారింది. పేగు తెంచుకు పుట్టిన కొడుకు పట్టించుకోని పరిస్థితి లో చివరకు కాశవ్వ చిన్న కూతురు తానే కొడుకై తల్లి అంత్యక్రియలు నిర్వహించింది.కొన్ని రోజులుగా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందిన కాశవ్వ. గత కొంతకాలంగా అనారోగ్యం పాలు కాగా నెహ్రూనగర్ అంబ భవాని ధర్మశాలల్లో ఆశ్రయం పొందింది. కాశవ్వకు ముగ్గురు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నాడు. కొడుకు దాసరి నారాయణ ఉపాధి కోసం మహారాష్ట్రలోని భీవండికి గత కొన్ని సంవత్సరాల క్రితం వలస వెళ్లాడు. సిరిసిల్లలోని అంబాభవాని దేవాలయం వద్ద ఆలయ ట్రస్ట్ చిలుక నారాయణ కట్టించిన రూములలోనే ఉంటూ అత్యంత దయనీయ పరిస్థితుల్లో అనారోగ్యంతో మూడు నెలల కాలం గడిపింది. కాశవ్వ చిన్న కూతురు తాటిపాముల మాలతి తల్లికి సపర్యలు చేస్తూ వచ్చింది. కొడుకు నారాయణ కనీసం పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తల్లి పట్ల మమకారం లేకుండా పోయిన కొడుకు "నా తల్లి ఎప్పుడో చనిపోయిందని అంత్యక్రియలకు రాలేనని," సమాచారం ఇవ్వడం అందరిని కలచి వేసింది. సమాచారం అందించినా ఆ తల్లిని చివరి చూపు చూడడానికి కూడా రాలేకపోయాడని ఆలయ ట్రస్ట్ చైర్మన్ చిలుక నారాయణ తెలిపారు. చివరికి కూతురే కొడుకుకై కాశవ్వ అంత్యక్రియలకు చిన్న కూతురైన మాలతి తల్లి అంత్యక్రియలు నిర్వహించారు. పడిపోతున్న మానవీయ విలువలకు కాశవ్వ జీవితం స్థానికులను కంటతడి పెట్టిస్తుంది.



## చేనేత "కళ" కే వన్నె తెచ్చిన సిరిసిల్ల చేనేత జంట

**- "పడుగు పేకల" మధ్య అరుదైన రికార్డ్**

**- మూడు గంటల 30 నిమిషాల్లో అగ్గిపెట్టెలో ఇమిడే చీర నేసిన వెల్ది హరిప్రసాద్**

**- అరుదైన రికార్డును సుసాధ్యం చేసిన సిరిసిల్ల చేనేత కళాకారుని ప్రతిభ**



**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** పడుగు పేకల మధ్య దుఃఖాన్ని చూసి తల్లడిల్లిన సమాజంలో సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ అరుదైన రికార్డుతో చేనేత కళకు వన్నె తీసుకొస్తున్నారు. ఎన్నో అరుదైన రికార్డులను తన సొంతం చేసుకున్న హరిప్రసాద్ ఈసారి ఆగస్టు 7 చేనేత దినోత్సవం సందర్భంగా కొత్త రికార్డను మరోసారి మన ముందు ఉంచారు. చేతి మగ్గాన్ని తన కళ కు వేదిక మలుచుకున్న హరి ప్రసాద్ ఇప్పటికే ఎన్నో అద్భుతాలను మనకు పరిచయం చేశారు. తన రికార్డులను తానే అధిగమిస్తూ ఈసారి కేవలం మూడు గంటల 30 నిమిషాల్లో 5.5 మీటర్ల పొడవు 45 అంగుళాల వెడల్పుతో 12 సెంటీమీటర్లు పొడవు 6.5 వెడల్పు 2.5 సెంటీమీటర్లు గల అగ్గిపెట్టెలో చ అగ్గిపెట్టెలో ఇమిడిపోయి చీరను చేతిమగ్గంపై నేసి అరుదైన రికార్డును తన సొంతం చేసుకున్నారు. ఆగస్టు మూడవ తేదీ సోమవారం కేవలం 210 నిమిషాలలో హరి ప్రసాద్ అలుపెరగకుండా ఏకతాటిగా మగ్గంపై చీరను నేసి చేనేత కళ కు వన్నెలు అద్దారు. చేనేత కళ తో సిరిసిల్ల ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన హరిప్రసాద్ మరోసారి తన రికార్డులని తానే అధిగమిస్తూ తొలిసారిగా ఎవరు చేయని ప్రయోగాన్ని చేనేత దినోత్సవం సందర్భంగా హరిప్రసాద్ చేతి మగ్గంపై చేనేత కళ లో మరో అద్భుతాన్ని ఆవిష్కరించారు.

**అతడి విజయం వెనుక ఆమె.**

ప్రతి మగాడి విజయం వెనుక ఓ మహిళ ఉంటుందంటారు. ఆ మహిళ కట్టుకున్న ఇల్లాలు అయితే ఆ విజయంలో ఆమెకు సగభాగం ఉంటుంది. తన గెలుపులో ఇల్లాలు రేఖ పాత్ర కీలకం అంటున్నారు. ఒకటి కాదు, రెండు కాదు ఎన్నో విజయాలను తన ఖాతాలో వేసుకున్నారు ఈ జంట. ఓపిగ్గా, పట్టుదలతో విజయం కోసం శ్రమించాడు అంటే రేఖ వల్లే చెప్పవచ్చు అంటున్నారు. ఆమె అందించిన ప్రోత్సాహమే నేడు తనకు అపురూపమైన విజయాలను అందిస్తుందని చెప్పక తప్పదు.జాతీయస్థాయిలో ఓ చేనేత కళాకారుడు తన ప్రయోగాలతో చేనేత కళకు వన్నెలు అద్దడం అపురూపమనే చెప్పాలి. పలువురు ప్రముఖులు చేనేత మగ్గంపై అద్భుతాలను సృష్టిస్తున్న హరి ప్రసాద్ ను అభినందిస్తున్నారు. రానున్న రోజుల్లో చేనేత కళ లోమరెన్నో అద్భుతాలను ఆవిష్కరించాలని కోరుకుందాం. కథనం కోసం సహాయ సహకారాలు అందించిన పరిశోధనాత్మక జర్నలిస్ట్ అల్లే రమేష్ కృతజ్ఞతలు.

## గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు




**- లంచం లేకుండా పని జరగదా.? వరుస ఆరోపణలతో మున్సిపాలిటీపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**

**- పెట్రోల్ బంక్ అనుమతుల నుంచి ఇంటి పర్మిషన్ల వరకు లక్షల్లో లంచాలు.**

**- ఉన్నత అధికారులు వాస్తవాలు వెల్లడించాలని ప్రజల డిమాండ్**

**గజ్వేల్ (ప్రశ్న న్యూస్ )** గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల వ్యవహారశైలిపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని స్థానికులు చెబుతున్నారు. మున్సిపాలిటీలో ఏ పని చేయించుకోవాలన్నా లంచం ఇవ్వాల్సిందేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇటీవల ఇంటి నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసిన ఓ నిర్మాణదారుడికి "టెక్నికల్ ప్రాబ్లమ్" పేరుతో నెలరోజుల పాటు అనుమతి ఇవ్వలేదని, దీనికి నిరసనగా ఆయన మున్సిపల్ కార్యాలయం ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం పట్టణంలో చర్చకు దారితీసింది.మరోవైపు, ఇంటి పై అంతస్తులో పెంట్ హౌస్ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకున్నారని, అనంతరం ప్రజాప్రతినిధి జోక్యంతో సమస్య పరిష్కారమైందనే ప్రచారం కూడా సాగుతోంది. తాజాగా ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌కు సంబంధించి రూ. 2.50 లక్షలు డిమాండ్ చేశారనే ఆరోపణలు మరింత సంచలనంగా మారాయి. ఈ వ్యవహారంలో ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వాదం జరిగిందని, అనంతరం విషయం బయటకు రాకుండా చర్చలు జరిగినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.ఎన్నికల సమయంలో ప్రజాసేవ చేస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు, గెలిచిన తర్వాత పనులకు అనుగుణంగా మామూళ్లు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకవర్గం ఏర్పడిన మూడు నెలలకే ఇలాంటి ఆరోపణలు రావడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైందని చెబుతున్నారు.మహిళా రిజర్వేషన్లు అమలులో ఉన్నప్పటికీ, అనేక చోట్ల మహిళా కౌన్సిలర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులే వ్యవహారాలు చక్కబెడుతున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ కథనంలో పేర్కొన్న అంశాలు స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలు, ప్రచారాల ఆధారంగా ఉన్నాయి. వీటిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరదించేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

## గ్యాస్ పేలి తండ్రి తో పాటు ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) గ్యాస్ పేలి తండ్రితో పాటు ముగ్గురు చిన్నారులు గాయపడ్డ సంఘటన శ్రీరంగ వరంలో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని శ్రీరంగ వరంలో చింతల శ్రీనివాస్ తన ఇంట్లో గ్యాస్ సిలిండర్ మారుస్తుండగా అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో తండ్రి శ్రీనివాస్ తో పాటు అయిన పిల్లలు (14) హరిప్రియ (10) కుమారుడు విక్రాంత్ (6) తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో శ్రీనివాస్ కుటుంబం తీవ్ర భయాందోళనకు గురైంది. అర్ధరాత్రి వేల ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు దిగ్భ్రాంతికి గురై వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో గాయపడ్డ తండ్రి శ్రీనివాస్ ఆయన పిల్లలకు స్థానికంగా ప్రథమ చికిత్స చేసి వెంటనే ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

## పొద్దుపొడిచినా వెలుగుతున్న వీధి దీపాలు

**- విద్యుత్ వృథాపై స్థానికుల ఆందోళన**

**- వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ గ్రామం, 4వ వార్డు కోదండరాంపల్లి ప్రాంతంలో పొద్దుపొడిచిన తర్వాత కూడా వీధి దీపాలు వెలుగుతుండటం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉదయం వెలుతురు వచ్చినప్పటికీ వీధి లైట్లు ఆపకుండా వెలిగిపోవడంతో ప్రభుత్వ విద్యుత్ అనవసరంగా వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, టైమర్లను సక్రమంగా అమలు చేయడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వ ధనం, విద్యుత్ ఆదా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జోగినులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**- అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జోగినుల కోసం కీలక ప్రకటనలు చేశారు. జోగినులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) జారీ చేయడంతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలందరికీ ఇది అత్యంత శుభదినమని, అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, విశిష్ట సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతరను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కాస్త ఒత్తిడి పెరిగినప్పటికీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో సేవలందించారని కొనియాడారు. జోగినులకు సమాజంలో తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినులను మున్సిపాలిటీల్లో కో–ఆప్షన్ సభ్యులుగా నియమించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయ, హోం, మున్సిపల్ శాఖల సమన్వయంతో బోనాల ఏర్పాట్లను మరింత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. జోగినులకు అధికారిక గుర్తింపు కల్పించడంపై సంబంధిత శాఖ మంత్రితో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588